ఆదివారం
06-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 45
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇమ్రాన్‌కు మూడేళ్ల జైలు, అరెస్టు

తోషాఖానా అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఇస్లామాబాద్‌లోని జిల్లా, సెషన్స్ కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. ఐదేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించింది. లక్ష పాకిస్తానీ రూపాయల జరిమానా కూడా విధించింది.

2 లో

వంటింటికి ధరల సెగ

- బెంబేలెత్తిస్తున్న బియ్యం ధరలు
- పప్పులు, పిండి ధరలూ పైపైకి...
- పాల ఉత్పత్తుల ధరలూ అంతే
- టమాటా సరసనే ఇతర కూరగాయలు

న్యూదిల్లీ:
వంటిల్లు చిన్నబోయింది. వంటకాల ఘుమఘుమలు లేనేలేవు. నెలకు సరిపడా నిండుగా ఉండాల్సిన పప్పు, ఉప్పు, పిండి, ఇతరత్రా సరుకులూ అరకొరే. పాలు తాగడాన్ని పక్కనబెడితే కాఫీ, టీలకూ కొద్దిగానే వాడుకోవల్సిన దుస్థితి. ఇక కూరల సంగతి సరేసరి. టమాటా ధర తారస్థాయికి చేరి ప్రజలను఼ారెత్తిస్తుండగా, దాని సరసనే ఇతర కూరగాయల ధరలు చేరాయి. ఆకు కూరల ధరలు సైతం పెరిగిపోయాయి. అల్పాహారం కోసం వాడే మినపపప్పు, రవ్వలు, శనగపప్పు ధరలు పరుగులు తీస్తున్నాయి. వాటి సంగతలా ఉంటే బియ్యం ధరలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఆహార పదార్థాల ధరల పెరుగుదల సామాన్యుల బడ్జెట్‌ను దెబ్బతీసింది. వర్షపాతం కారణంగా తగినంత సరఫరా లేకపోవడంతో టమాటా ధరలు గణనీయంగా పెరగడం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నప్పటికీ బంగాళాదుంపలు మినహా ఇతర కీలకమైన ఆహార పదార్థాల ధరలు సైతం గణనీయంగా పెరిగాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ విషయాన్ని ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ వారం పార్లమెంటుకు తెలియజేసింది. కంది పప్పు ధరలు అత్యధికంగా 28 శాతం పెరిగాయి. తర్వాత బియ్యం (10.5 శాతం), మినపప్పు, ఆటా (రెండూ 8 శాతం) ఉన్నాయి. గురువారం నాటికి కిలో బియ్యం సగటు చిల్లర ధర రూ.41 ఉండగా, అంతకుముందు ఏడాది రూ.37 గా ఉంది. దేశీయ ఉత్పత్తిలో తగ్గుదల కారణంగా పప్పు ధరలు పెరగడానికి కారణమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2022-23 పంట సంవత్సరానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన మూడవ అధునాతన అంచనా ప్రకారం 34.3 లక్షల టన్నుల పప్పు ఉత్పత్తిని అంచనా వేసింది. ఇది మునుపటి పంట సంవత్సరంలో ఉత్పత్తి చేయబడిన 42.2 లక్షల టన్నుల నుంచి తగ్గింది. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధరల పర్యవేక్షణ విభాగం ప్రకారం, బంగాళదుంపల సగటు రిటైల్ ధర గత సంవత్సరం కంటే 12 శాతం తక్కువగా ఉంది. ఉల్లి ధరలు గత సంవత్సరం కంటే సుమారు 5 శాతం పెరిగాయి. టమాటా ధరలకు సంబంధించి, సీజనల్ పంటల విధానాలు, కోలార్‌లో తెల్ల ఈగ వ్యాధి వ్యాప్తి, ఉత్తర ప్రాంతంలో అకస్మాత్తుగా రుతుపవనాల వర్షం హరియాణా, హిమాచల్ ప్రదేశ్‌లలో టమాటా

- మిగతా 2 లో

సెప్టెంబరులో ఉల్లి ఘాటు

ముంబై:
ఉల్లి ధరలు మరోసారి ఘాటెక్కించనున్నాయి. ఈ నెలాఖరు వరకు ఉల్లి ధరలు పెరుగుతూ వెళ్లి, సెప్టెంబరు కల్లా కిలో రూ.60-70 వరకు చేరొచ్చని 'క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ అండ్ అనలిటిక్స్' తెలిపింది. అయితే 2020 సంవత్సరం నాటి గరిష్ఠాల దిగువనే ఉల్లి ధరలు కొనసాగుతాయని చెప్పింది. 'సరఫరా-గిరాకీ అసమతుల్యత ఆగస్టు చివరి నాటికి ప్రతిబింబించొచ్చు. రబీ ఉల్లి

- మిగతా 2 లో

జాబిల్లి కక్ష్యలోకి చంద్రయాన్-3



బెంగళూరు:
భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 దశలవారీ పురోగతిని కొనసాగిస్తోంది. తాజాగా మరో కీలక ఘట్టాన్ని పూర్తి చేసుకుంది. భూకక్ష్య నుంచి ట్రాన్స్ లూనార్ కక్ష్యలో ప్రయాణం సాగించిన చంద్రయాన్-3 ప్రస్తుతం చంద్రుని కక్ష్యకు చేరింది. ఇకపై చంద్రుడి చుట్టూ చక్కర్లు కొట్టనుంది. శనివారం రాత్రి 7 గంటలప్పుడు చంద్రుడి కక్ష్యలోనికి చంద్రయాన్-3 ప్రవేవించినట్లు ఇస్రో ట్వీట్ చేసింది. ఈ ప్రక్రియ బెంగళూరులోని 'ఇస్రో టెలీమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్' పర్యవేక్షణలో సాగిందని, 18 రోజుల పాటు చంద్రుడి కక్ష్యలోనే చంద్రయాన్-3 ఉంటుందని ఇస్రో పేర్కొంది. ఇప్పటికే మూడింట రెండొంతుల ప్రయాణాన్ని చంద్రయాన్-3 పూర్తి చేసుకుంది. అంతా సజావుగా జరిగితే 23వ తేదీన చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ దిగుతుంది. ఈ ల్యాండర్ సొంతంగా నిర్ణయాలను తీసుకోగలదని ఇస్రో తెలిపింది. చంద్రయాన్-2 ల్యాండింగ్ సమయంలో చంద్రుడి ఉపరితలాన్ని ల్యాండర్ బలంగా ఢీకొనడంతో అందులోని వ్యవస్థలు పని చేయలేదు. కానీ ఇప్పుడు అలాంటి సమస్య రాకుండా దానిని మెరుగుపర్చారు. చంద్రయాన్-3ని జులై 14న ప్రయోగించిన విషయం విదితమే.

మణిపూర్‌లో మళ్లీ హింస

- మరో ముగ్గురి మృతి...
- ముగ్గురికి గాయాలు

ఇంఫాల్:
మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి తండ్రీకొడుకులు సహా ముగ్గురు వ్యక్తులను ఉగ్రవాదులు హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలోని క్వాక్తా వద్ద ముగ్గురు నిద్రిస్తుండగా తుపాకీతో కాల్పులు జరిపి, కత్తులతో నరికి చంపారని, దుండగులు చురాచంద్‌పూర్ నుంచి వచ్చారని శనివారం ఉదయం పోలీసులు తెలిపారు. 'ముగ్గురూ సహాయక శిబిరంలో ఉండేవారు. అయితే పరిస్థితి మెరుగుపడిన తర్వాత శుక్రవారం క్వాక్తాలోని వారి నివాసాలకు తిరిగి వచ్చారు' అని పోలీసులు తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే ఆగ్రహించిన గుంపు క్వాక్తా వద్ద గుమిగూడి చురాచంద్‌పూర్ వైపు వెళ్లాలనుకుందని, కానీ భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారని పోలీసులు తెలిపారు. 'శనివారం ఉదయం క్వాక్తా సమీపంలో రాష్ట్ర బలగాలు, ఉగ్రవాదుల మధ్య భారీ ఎదురుకాల్పులు జరగడంతో ఒక పోలీసుతో సహా ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసు ముఖంపై గాయాలయ్యాయి. ముగ్గురినీ చికిత్స కోసం ఇంఫాల్‌లోని రాజ్ మెడిసిటీకి తీసుకువచ్చారు. వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు' అని పోలీసులు

- మిగతా 2 లో

ఆగస్టు 31-సెప్టెంబరు 1న ముంబైలో 'ఇండియా'

కూటమి భేటీ

శివసేన (యూబీటీ) ఆతిథ్యం

న్యూదిల్లీ:
ప్రతిపక్ష కూటమి 'ఇండియా' తదుపరి సమావేశం ఆగస్టు 31-సెప్టెంబరు 1న ముంబైలో జరగనున్నది. బెంగళూరు సమావేశం తరహాలో దీనిని నిర్వహించనున్నారు. ప్రతిపక్షాల సమావేశం రెండు రోజుల పాటు జరగనుందని, ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీలను నేతలంతా ఆమోదించారని ఆ వర్గాలు తెలిపాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) ప్రతిపక్ష కూటమి 'ఇండియా' మూడవ సమావేశానికి ఆగస్టు 31-సెప్టెంబరు 1 తేదీల్లో ముంబైలో ఆతిథ్యం ఇవ్వనుందని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు. దీనికి సంబంధించి శనివారం జరిగిన మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) సమావేశం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కూరగాయలు స్మగ్లింగ్ చేస్తుంటే అరెస్టు చేశా సార్!

కొల్లేరును కొల్లగొడుతున్నారు!

ఆక్రమణదారుల చెరలో తాగునీటి సరస్సు

దేశంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరు భవితవ్యం నేడు కలవరపెడుతోంది. ప్రకృతి ప్రసాదించిన ఈ సరస్సు స్వార్థపూరిత రాజకీయాల వలలో చిక్కి శల్యమవుతోంది. సుమారు లక్ష ఎకరాల్లో విస్తరించిన సరస్సు 60 శాతం పైగా అక్రమార్కుల కబంధహస్తాల్లో బందీ అయి సహజత్వాన్ని కోల్పోతోంది. కొల్లేరును పరిరక్షించాలని కలలుగన్న చంద్రబాబు తీసుకొచ్చిన జీవో 12ను వైఎస్ అమలు పరిచినా నేడు వైసీపీ ప్రభుత్వంలో ఆక్రమణల పర్వానికి అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. 2009లో కేంద్రం చిత్తడి నేలల పరిధిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నా, 2012లో ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించినా ఐదో కాంటూరు నానాటికీ కుచించుకుపోతూ ఉనికికే ప్రమాదకరంగా పరిణమించింది. సహజసిద్ధంగా ఏర్పడి ఆసియా ఖండంలోనే ఘనతకెక్కిన కొల్లేరు నేడు గడ్డు కాలం ఎదుర్కొంటోంది. రానురాను కర్పూర హారతిలా కరిగిపోతోంది.

- బడాబాబులకు అధికారుల దాసోహం
- నోట్ల కట్టలతో నోరుమూస్తున్న కబ్జాదారులు
- అమలుకాని గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు
- సహజత్వాన్ని కోల్పోతున్న అభయారణ్యం
- వేసవిలో ఎడారిని తలపిస్తోన్న వైనం
- వలస పక్షులకు ముప్పు... చలించిపోతున్న పర్యాటకులు
- ఘనమైన చరిత్ర పుస్తకాలకే పరిమితం

విశాలాంధ్ర-డిజిటల్ :
ఆంధ్ర ప్రదేశ్‌లో పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో సహజసిద్ధంగా ఏర్పడిన తాగునీటి సరస్సు కొల్లేరు. సుమారు లక్ష ఎకరాలకు విస్తరించి ఉన్న సరస్సు 88 రకాల చేపల వృద్ధికి ప్రసిద్ధి. పచ్చటి ప్రకృతి అందాలతో, ఆస్ట్రేలియా, సైబీరియా, దక్షిణాఫ్రికా, కెనడా, అమెరికా, అలస్కా నుంచి వచ్చే 183 రకాల వలస పక్షులు నివాసం ఏర్పరచుకుని కిలకిలరావాలతో చేసే అల్లరితో కొల్లేరు అలరారుతూ ఉంటుంది. కృష్ణా, గోదావరి నదుల డెల్టా ప్రాంతంలో ప్రకృతి ప్రసాదించిన లోతట్టు సరస్సులో బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరుల ద్వారా నీరు వచ్చి చేరుతుంది. కొల్లేరు సుమారు 340 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇదంతా గతం. అయితే, స్వార్థపూరిత రాజకీయాల వల్ల నేడు అది బక్కచిక్కిపోతోంది. బడాబాబులు కొల్లేటివాసులను

- మిగతా 2 లో

బీజేపీ ఎంపీకి రెండేళ్ల జైలు

లక్నో:
ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రామ్ శంకర్ కఠేరియాకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు శనివారం తీర్పునిచ్చింది. 2012లో టోరెంట్ పవర్ కంపెనీ కార్యాలయం విధ్వంసం కేసులో ఆయనకు ఈ మేరకు శిక్ష పడింది. సెక్షన్ 147 కింద రెండేళ్లు, సెక్షన్ 323 కింద ఏడాది శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. దీనిపై కఠేరియా స్పందిస్తూ కోర్టు నిర్ణయంపై అప్పీల్ చేసుకునే హక్కు ఉన్నందున పై కోర్టుకు వెళతానని చెప్పారు. యథాప్రకారమే కోర్టుకు వెళితే తనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చిందన్నారు. కోర్టు తీర్పును గౌరవిస్తున్నానని చెప్పారు. ఇటావా నియోజకవర్గ ఎంపీ రామ్ శంకర్ 2014 నుంచి 2016 జులై వరకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా సేవలు అందించారు. షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ చైర్మన్‌గా పనిచేశారు. రక్షణ, సంప్రదింపుల కమిటీ, హోంశాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యుడిగా కఠేరియా ఉన్నారు.

టీటీడీ చైర్మన్‌గా భూమన

ఆగస్టు 8న ముగియనున్న ప్రస్తుత బోర్డు పదవీ కాలం

విశాలాంధ్ర-తిరుమల :
తిరుమల తిరుపతి దేవస్థానం కొత్త చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఇప్పుడున్న చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రస్తుత టీటీడీ బోర్డు పదవీకాలం ఆగస్టు 8తో ముగియనుంది. తిరుపతి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డికి గతంలో కూడా టీటీడీ చైర్మన్‌గా పని చేసిన అనుభవం ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2006 నుంచి 2008 వరకు టీటీడీ చైర్మన్‌గా ఆయన పని చేశారు. వైఎస్సార్ జిల్లా, నందలూరు మండలం, ఈదరపల్లెలో జన్మించిన కరుణాకరరెడ్డి తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీలో పట్టాలు పొందారు. మహాత్ముడి ఆత్మకథ సత్యశోధనను భూమన ప్రత్యేక శ్రద్ధతో పునర్ముద్రించారు. రాజకీయాల్లో డాక్టర్ వైఎస్సార్‌కు సన్నిహితంగా ఉండేవారు. 2012లో తిరుపతి నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2019లో తిరుపతి నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత నెలలో (జులై 2023లో) భూమనను రాష్ట్ర ప్రభుత్వం సభా హక్కుల కమిటీ చైర్మన్‌గా నియమించింది. కాగా, తనను టీటీడీ చైర్మన్‌గా నియమించినందుకు భూమన కరుణాకర్ రెడ్డి... సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తాజా నియామకంతో రెండేళ్ల పాటు టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి పదవి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ఇంజినీరింగ్ తరగతులు జాప్యం

ఏపీ ఈఏపీసెట్-2024 ప్రవేశాల ప్రక్రియలో స్వల్ప మార్పుల కారణంగా ఇంజినీరింగ్ తరగతులు జాప్యం కానున్నాయి. తొలి విడత జారీ చేసిన వెబ్ కౌన్సెలింగ్ ప్రకారం ఈ నెల16వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. వెబ్ ఆప్షన్ ఎంపిక ప్రక్రియను ఈనెల 7వ తేదీకి వాయిదా వేయడంతో విద్యార్థులకు అసౌకర్యం ఏర్పడింది.

2 లో

పుంగనూరు రగడ

వైసీపీ, టీడీపీ పరస్పర విమర్శలు

- విచారణకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశం
- పోలీసులపై దాడికి రాష్ట్ర పోలీసు సంఘం ఖండన
- గవర్నర్‌కు టీడీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
పుంగనూరు ఘటనపై సమగ్ర విచారణకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనను నిరసిస్తూ వైసీపీ శనివారం చిత్తూరు జిల్లా బంద్ నిర్వహించింది. పుంగనూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన విధ్వంసంపై...అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ పరస్పర విమర్శల దాడికి

- మిగతా 2 లో

ఇమ్రాన్‌కు మూడేళ్ల జైలు, అరెస్టు

లక్ష రూపాయాల జరిమానా కూడా

తోషాఖానా కేసులో సెషన్స్ కోర్టు తీర్పు

ఇస్లామాబాద్: తోషాఖానా అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఇస్లామాబాద్‌లోని జిల్లా, సెషన్స్ కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. ఐదేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించింది. లక్ష పాకిస్తానీ రూపాయల జరిమానా కూడా విధించింది. జరిమానా కట్టకపోతే ఆరు నెలల పాటు జైల్లో ఉండాల్సి వస్తుందని ఇమ్రాన్ ఖాన్‌ను న్యాయస్థానం హెచ్చరించింది. పీటీఐ చైర్మన్ ఇమ్రాన్ ఖాన్‌పై అక్రమాస్తులను కలిగి వున్నట్లు వచ్చిన ఆరోపణలు రుజువు అయ్యాయని అదనపు, సెషన్స్ జడ్జి హుమాయున్ దిలావర్ తన తీర్పులో పేర్కొన్నారు. ఇమ్రాన్ ఖాన్ తక్షణ అరెస్టునకు వారెంటును జారీచేశారు. దీంతో క్షణాల వ్యవధిలోనే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. లాహోర్‌లోని జమన్ పార్క్ నివాసం నుంచి ఇమ్రాన్‌ను అరెస్టు చేశారు. తోషాఖానా కేసులో ఇమ్రాన్ ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టు (ఐహెచ్‌సీ)తో పాటు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించిన తర్వాత విచారణ కోర్టు శనివారం ఇమ్రాన్ పేషీని ఆదేశించింది. ఈ కేసును వేరొక కోర్టుకు బదిలీ చేయాలని ఇమ్రాన్ పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. విచారణ చేపట్టాలని సెషన్స్ కోర్టుకు ఆదేశాలిచ్చింది. ఇమ్రాన్ ఖాన్ అరెస్టును ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌కు ప్రత్యేక సహాయకుడు (అసిస్టెంట్) అతాయుల్లా తరార్ ధ్రువీకరించారు. ఆయనను రావల్పిండిలోని అడియాలా జైలులో ఉంచాలా లేక మరో జైలులోనా అన్నది తర్వాత నిర్ణయిస్తామని చెప్పారు. ఇదిలావుంటే, ఈనెల 9న అసెంబ్లీని రద్దు చేయనున్నట్లు ప్రధాని షరీఫ్ ప్రకటించారు. ఆ తర్వాత 90 రోజుల్లో ఎన్నికలు జరగాల్సిన నేపథ్యంలో ఇమ్రాన్‌పై అనర్హత వేటు పడటం చర్చనీయాంశంగా మారింది. గతేడాది ఏప్రిల్‌లో అవిశ్వాస తీర్మానం కారణంగా ఇమ్రాన్ పదవిని కోల్పోయిన తర్వాత వరుసగా కేసులు నమోదయ్యాయి. ప్రధానగా ఉన్నప్పుడు విదేశాల నుంచి వచ్చిన బహుమతులను విక్రయించారనే ఆరోపణలపై కేసు నమోదైంది. వాస్తవానికి ఇమ్రాన్‌కు 58 బహుమతులు రాగా వాటిని తోషాఖానాలో ఉంచాలి.

ఒకవేళ వాటిని సొంతం చేసుకోవాలని భావిస్తే కనీసం సగం ధర చెల్లించాల్సి ఉంటుంది. ఇమ్రాన్ రూ.38 లక్షల రొలెక్స్ గడియారాన్ని రూ.7,54,000 చెల్లించి సొంతం చేసుకొన్నారు. రూ.15 లక్షల మరో రొలెక్స్ గడియారానికి రూ.2,94,000 మాత్రమే చెల్లించారు. రూ.8 లక్షల విలువ చేసే కానుకలను ఖజానాకు రూపాయి కూడా జమ చేయలేదని, దుబాయిలో అమ్ముకొన్నారని ఇమ్రాన్‌పై ఆరోపణలు వచ్చాయి.

బ్రిటన్‌లో ఈజీ5.1 కలకలం

లండన్: కోవిడ్-19లో ఒమిక్రాన్ రకం నుంచి వచ్చిన కొత్త వేరియంట్ 'ఈజీ.5.1' బ్రిటన్‌ను బెంబేలెత్తిస్తుంది. వేగంగా వ్యాప్తి చెందుతోంది. దేశంలో నమోదైన కోవిడ్ కొత్త కేసుల్లో 14.6శాతం కొత్త వేరియంట్‌కు సంబంధించినవే ఉన్నట్లు బ్రిటన్ ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ప్రపంచ దేశాల్లోనూ ఈజీ 5.1 కేసులు నమోదు అవుతున్నట్లు వెల్లడించారు. ఈ వేరియంట్ వ్యాప్తి గతి, ప్రభావం తదితర అంశాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పరిశీలిస్తోంది. ఈ వేరియంట్‌తో తీవ్ర ఇన్‌ఫెక్షన్ వస్తుందన్న సూచనలేమీ లేవని తెలిపింది.

అమెజాన్ పరిరక్షణకు వచ్చే వారం సదస్సు

బెలెమ్: అమెజాన్ అడవి పరిరక్షణ కోసం దక్షిణ అమెరికా దేశాల సదస్సు వచ్చే వారంలో బ్రెజిల్ అధ్యక్షతన జరగబోతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద వర్షారణ్యమైన అమెజాన్‌ను పంచుకునే దేశాధినేతలతో ప్రాదేశిక స్థాయి సదస్సుకు అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా చేపట్టనున్నారు. అమెజాన్ సహకార ఒప్పంద సంఘంలోని ఎనిమిది దేశాలు మంగళ, బుధవారాల్లో అమెజాన్ రాజధాని నగరంలోని బెలెమ్‌లో జరిగే సదస్సులో పాల్గొనున్నాయి. 2025లో ఇదే నగరంలో జరగబోయే కాప్ 30 ఐరాస వాతావరణ చర్చలకు రిహార్సల్స్‌గా తాజా సదస్సు ఉంటుంది. 2009 తర్వాత ఈ సంఘం మొదటిసారి భేటీ అవుతోంది. వాతావరణ మార్పుపై పోరులో బ్రెజిల్ తిరిగొచ్చింద్న ఉద్ఘాటనతో ఆ దిశగా లూలా ముందుకు సాగుతున్నారు. 2010-2018తో పోల్చితే అమెజాన్ కర్బన ఉద్గారాలు 2020లో 117శాతానికి పెరిగినట్లు బ్రెజిల్ జాతీయ అంతరిక్ష సంస్థ (ఐఎన్‌పీఈ) పరిశోధకలు తెలిపారు. బొలీవియా, కొలంబియా, ఈక్వెడార్, గుయానా, పెరూ, సురినేమ్, వెనిజులాతో కలిసి అమెజాన్ బేసిన్ అభివృద్ధికి నడుం బిగించినట్లు లూలా ప్రకటించారు. రాబోయే కాలానికి మార్గదర్శకాలతో కూడిన సంయుక్త తీర్మానం ద్వారా ఈ సదస్సు ముగుస్తుందని బ్రెజిల్ విదేశాంగ శాఖ అధికారి జిసెలా పదోవన్ వెల్లడించారు.

వెనిజులా ఇంధనం ఒప్పందంపై సంతకాలు

వెనిజులాతో ఇంధనం కొలుకోసం ఒప్పందాన్ని బ్రెజిల్ కుదుర్చుకుంది. దానిపై లూలా సంతకం చేశారు. 2019లో అప్పటి అధ్యక్షుడి బోల్సనారో దీనికి అడ్డు కట్ట వేయగా ఇప్పుడు మరలా వెనిజలాకు ద్వారాలను లూలా సర్కార్ తెరిచింది. స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనాన్ని వెనిజులాలోని గురి ప్లాంట్ నుంచి సేకరించేలా ఒప్పందం జరిగిందని బ్రెజిల్ గనులు, ఇంధన శాఖ మంత్రి అలెగ్జాండర్ సిల్వేరియా తెలిపారు. అమెజాన్‌లోని పారింటినిస్ పట్టంలో జరిగిన వేడుక సందర్భంగా తాజా ఒప్పందంపై సంతకాలు జరిగా యన్నారు. దీంతో చుట్టుపక్కల దేశాలతో సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని సిల్వేరియా ఆకాంక్షించారు. అర్జెంటైనా, ఉరుగ్వే, పారాగ్వాతో విద్యుత్‌ను బ్రెజిల్ పంచుకుంటోందని ఆయన గుర్తుచేశారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఇదిలాంఉడగా, హింస కారణంగా జిల్లా యంత్రాంగం జంట ఇంఫాల్ జిల్లాల్లో కర్ఫ్యూ సడలింపు వేళలను కుదించింది. 'ఇంఫాల్ జంట జిల్లాల్లో ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కర్ఫ్యూ సడలింపుకు బదులుగా ఇప్పుడు దానిని ఉదయం 5 నుంచి 10.30 గంటలకు కుదించాము' అని ఒక అధికారి తెలిపారు. ఆగస్టు 4న కౌత్రుక్ కొండ శ్రేణిలో భద్రతా బలగాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఏడు అక్రమ బంకర్లను ధ్వంసం చేసినట్లు మణిపూర్ పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, శనివారం మణిపూర్‌లోని 27 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చిన 24 గంటల సార్వత్రిక సమ్మె కారణంగా ఇంఫాల్ లోయలో సాధారణ జీవితం స్తంభించింది. దాదాపు అన్ని ప్రాంతాలలో మార్కెట్లు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి.

ముంబైలో 'ఇండియా' కూటమి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం విలేకరులతో మాట్లాడిన రౌత్... ఐదుగురు ముఖ్యమంత్రులతో సహా విపక్ష నేతలకు ఆగస్టు 31న విందుకు ఠాక్రే ఆతిథ్యం ఇస్తారని చెప్పారు. నగర శివారులోని గ్రాండ్ హయత్‌లో జరిగే రెండు రోజుల చర్చలు ఆగస్టు 31 సాయంత్రం, సెప్టెంబరు 1 ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని, సాయంత్రం విలేకరుల సమావేశం ఉంటుందని ఆయన వివరించారు. మహా వికాస్ అఘాడి కూటమిలోని మూడు ప్రధాన పార్టీలయిన కాంగ్రెస్ మద్దతుతో ఎన్‌సీపీకి చెందిన శరద్ పవార్ వర్గం, శివసేన (యూబీటీ) 'ఇండియా' కూటమి మూడవ సమావేశాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ కూటమి మొదటి సమావేశం జూన్‌లో పాట్నాలో, రెండవది గత నెలలో బెంగళూరులో జరిగింది. రౌత్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు చెందిన రాహుల్ గాంధీతో సహా పర్యటనకు వచ్చే నాయకులకు రవాణా, భద్రత అంశాలపై ఎంవీఏ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతారని చెప్పారు. 'ఈరోజు సమావేశమైన ఎంవీఏ నాయకులు పాట్నా, బెంగళూరులో జరిగిన తరహాలో 'ఇండియా' సమావేశాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించారు. రెండు రోజుల సమావేశాల సన్నాహకాల కోసం మేము ప్రతి నాయకుడికి బాధ్యతలు అప్పగించాము' అని రౌత్ అన్నారు. శనివారం నాటి సమావేశానికి హాజరయిన వారిలో ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్, ఆయన పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు జయంత్ పాటిల్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, సహచరులు సుభాష్ దేశాయ్, రౌత్, కాంగ్రెస్ నేతలు, మాజీ ముఖ్యమంత్రులు పృథ్వీరాజ్ చవాన్, అశోక్ చవాన్, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ చీఫ్ బాలాసాహెబ్ థోరట్, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు విజయ్ వాడెట్టివార్, కాంగ్రెస్ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు నానా పటోలే ఉన్నారు. కాగా, 'ఇండియా' కూటమి మూడవ సమావేశంలో 2024 సాధారణ ఎన్నికల ప్రచారం వంటి నిర్దిష్ట చర్యల కోసం కమిటీల కూర్పును కూడా ప్రకటించే అవకాశం ఉంది. పార్టీల మధ్య మెరుగైన సమన్వయం కోసం జాయింట్ సెక్రటేరియట్‌ను కూడా త్వరలో ప్రకటించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో పార్టీలు తమ విభేదాలను వీలైనంత వరకు పరిష్కరించుకోవాలని భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రత్యక్ష ఎన్నికల పోరులో ఉన్న రాష్ట్రాల్లో. బెంగళూరు సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 26 పార్టీల దాదాపు నాలుగు గంటల సుదీర్ఘ సమావేశం తర్వాత ప్రతిపక్ష కూటమి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) పేరును ప్రకటించారు. సమన్వయం కోసం 11 మంది సభ్యులతో కూడిన కమిటీని కూడా ఏర్పాటు చేస్తామని, ముంబైలో జరిగే తదుపరి సమావేశంలో కన్వీనర్‌ను ఎంపిక చేస్తామని ఆయన చెప్పారు. ఈ కూటమిలో కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఆప్, జేడీ(యూ), ఆర్‌జేడీ, జేఎంఎం, ఎన్‌సీపీ (శరద్ పవార్), శివసేన (యూబీటీ), ఎస్‌పీ, ఎన్‌సీ, పీడీపీ, సీపీఐ, సీపీఎం, ఆర్‌ఎల్‌డీ, ఎండీఎంకే, కొంగునాడు మక్కల్ దేశాయ్ కట్చి (కేఎండీకే), వీసీకే, ఆర్‌ఎస్‌పీ, సీపీఐ-ఎంఎల్ (లిబరేషన్), ఫార్వార్డ్ బ్లాక్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి), అప్నా దళ్ (కామెరవాడి), మానితానేయ మక్కల్ కట్చి (ఎంఎంకే) ఉన్నాయి.

పుంగనూరు రగడ

(మొదటిపేజీ తరువాయి)

దిగాయి. పుంగనూరు ఘర్షణకు చంద్రబాబే కారణమని, ఆయనను మొదటి ముద్దాయిగా చేర్చాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. కాగా, జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని టీడీపీ విమర్శించింది. ఈ మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు టీడీపీ బృందం ఫిర్యాదు చేసింది.

పుంగనూరు ఘటనపై విచారణ జరపాల్సిందిగా డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్‌పీ రిషాంత్‌లను డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. టీడీపీ కార్యకర్తల దాడిలో పోలీసులు తీవ్రంగా గాయపడినట్లు ఆయన చెప్పారు. రాళ్లు రువ్విన, పోలీసు వాహనాలకు నిప్పుపెట్టిన నిందితులను సీసీ కెమెరాల ద్వారా ఇప్పటికే గుర్తించామని తెలిపారు. సీసీ కెమెరాలను ఇంకా పరిశీలిస్తున్నట్లు వివరించారు. మరికొందరి కదలికలపైనా నిఘా ఉంచామని చెప్పారు. వాహనాలను ఉద్దేశపూర్వకంగా తగులపెట్టారని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. చంద్రబాబు రూట్ ప్లాన్ మార్పు వ్యవహారమూ విచారణలో తేలుతుందన్నారు. ఈ ఘటనకు బాధ్యులకు సంబంధించిన పూర్తి సమాచారం తమ వద్ద ఉందని, రెచ్చగొట్టే ప్రసంగాలపైనా దృష్టి పెట్టామని డీజీపీ చెప్పారు. శాంతిభద్రతలకు విఘాగం కలిగిస్తే సహించబోమని స్పష్టంచేశారు. డీజీపీ ఆదేశాలతో డీఐజీ, ఎస్పీ రంగంలోకి దిగారు. వేగంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సంఘటన వివరాలను ఆ ఇద్దరూ మీడియాకు వెల్లడించారు. పుంగనూరు ఘటనపై అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ పరస్పరం మాటల దాడికి దిగాయి. ఈ దాడిని ఒకరిపై మరొకరు నెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. పోలీసులపై దాడిని రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నాగరాణి తీవ్రంగా ఖండించారు. తాము ఏ పార్టీకి అనుకులమో, వ్యతిరేకమో కాదని, విధి నిర్వహణల ఉన్న పోలీసులపై దాడులకు పాల్పడటాన్ని సహించేది లేదని స్పష్టంచేశారు. పుంగనూరు ఘటనకు టీడీపీ అధినేత చంద్రబాబే కారణమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాయలసీమకు ద్రోహం చేశారనే దుష్ప్రచారం చేసేందుకు చంద్రబాబు పుంగనూరుకు వెళ్లారని, ఆ ప్రాంతంలో హింసను ప్రోత్సహించి ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు.

కొల్లేరును కొల్లగొడుతున్నారు!

(మొదటిపేజీ తరువాయి)

ఏమర్చి సొసైటీల మాటున వేలాది ఎకరాల్లో వెయ్యికి పైగా అక్రమంగా చేపల చెరువులు తవ్వడంతో 42 శాతం మేర సహజత్వాన్ని కోల్పోయింది. ఉన్న నీటిని కాస్తా మోటార్లతో తోడేయడంతో వేసవిలో ఎడారిని తలపిస్తోంది. ఎనిమిది శాతం పైగా భూమిలో వ్యవసాయం చేయడంతో ఘనమైన గత చరిత్రను పుస్తకాల్లో చదివి సరస్సు చూడడానికి వెళ్లిన యాత్రికులకు నేడు కనిపించేది చిన్న తరహా చెరువు. కబ్జాదారుల కోరల్లో చిక్కిశల్యమైన కొల్లేరును చూసి ప్రకృతి ప్రేమికులు చలించిపోతున్నారు. దురాశ, దుర్నీతి, దురాక్రమణ చూసి గుండెలు బాదుకుంటున్నారు. ఒకప్పుడు మంచినీటి సరస్సుగా పేరొంది నేడు కాలుష్య కోరల్లో చిక్కి గరళంగా మారడం యాత్రికులకు మింగుడు పడడం లేదు.

కొల్లేరు సమాంతర కొలతలు తీసి కాంటూర్లుగా నిర్ధారిస్తారు. కానీ ఏ కాంటూరు చూసినా ఆక్రమణలపర్వం రాజ్యమేలుతోంది. ముఖ్యంగా ఐదో కాంటూరు నిత్యం వివాదాలమయమే. ఆర్థిక, అంగ, అధికార బలం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ప్రత్యేకించి పశ్చిమ గోదావరి జిల్లా కొల్లేరు భూముల్లో అడ్డూఅదుపూ లేని ఆక్రమణలను అడ్డుకునేవారే కరవయ్యారు. బడాబాబులు వందలాది ఎకరాల పైబడి రాజకీయ అండతో చేపల చెరువుగా మార్చేసినా అడిగే నాథులే లేరు. పర్యావరణానికి తూట్లు పొడిచి ఆక్వా సాగు చేస్తూ తలాపాపం తిలాపిడికెడు అన్నట్టు నోట్ల కట్టలను ప్రజాప్రతినిధులు, అధికారుల నోట్లో కుక్కి నోరు మూయించడం బహిరంగ రహస్యమే.

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు చంద్రబాబు సీఎంగా ఉండగా, దృఢనిశ్చయంతో కొల్లేరును కాపాడే ప్రయత్నం చేశారు. 1999లో చంద్రబాబు ప్రభుత్వం జీవో 12 విడుదల చేసి ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించింది. 2006లో వైఎస్ ఆ జీవోను అమలు చేశారు. 'ఆపరేషన్ కొల్లేరు'ను పకడ్బందీగా అమలుపరిచి ఆక్రమణలు తొలగించారు. చేపల సాగు చేస్తున్న చెరువులన్నింటినీ ధ్వంసం చేయించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కట్టడి జరిగినా ఆ ఘనత అంతా వైఎస్‌కే దక్కింది.

నేడు వైసీపీ హయాంలో కబ్జాదారులు తమ కార్యకలాపాలు దర్జాగా సాగిస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏకంగా ఓ ప్రజాప్రతినిధి తన చేపల చెరువుల వద్దకు వెళ్లేందుకు నేరుగా రహదారినే నిర్మించారని కొల్లేరు వాసులు బహిరంగంగానే వెల్లడిస్తున్నారు. పాలకులు, అధికారులకు ఈ విషయం తెలియనిది ఏమీ కాదు. ప్రతిపక్ష పార్టీల నేతలు ఎవరైనా నిలదీస్తే దళితులను అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు పెట్టడం పరిపాటిగా మారింది. ఆక్రమణలు తొలగించాలని, చెరువులను ధ్వంసం చేయాలని, గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు, హైకోర్టు తీర్పు అమలు చేయాలని గగ్గోలు పెట్టినా అధికారులు బుట్టదాఖలు చేశారని మండిపడుతున్నారు. దశాబ్దాల క్రితం కొల్లేరు వాసులు సరస్సులో స్వేచ్ఛగా చేపలు పట్టుకుని జీవనోపాధి సాగించేవారు. కానీ నేడు కబ్జాదారుల కోరల్లో చిక్కుకోవడంతో వారి వద్దే కొల్లేటి ప్రజలు కూలీలుగా మారారు. ఆత్మాభిమానం చంపుకోలేని మరికొందరు ఉపాధి కోసం వలసబాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. చేపల చెరువుల నుంచి విడుదలైన కలుషిత నీరు మంచినీటిని గరళంగా మార్చడంతో ఆ నీరు తాగి పక్షులు సైతం మృత్యువాత పడుతున్నాయి. పశువులకు సైతం అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని పశు పోషకులు లబోదిబోమంటున్నారు. కొల్లేటి వాసులు తాగునీటికి కటకటలాడుతున్నారు. వలస పక్షులను, ప్రభుత్వ భూములను సంరక్షించాల్సిన అధికారులు బడాబాబులకు దాసోహమై అందినకాడికి దోచుకుంటున్నారని బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిట్టచివరి ప్రయత్నంగా కాంటూరు ఐదు పరిధిని కాంటూరు మూడుకు కుదిస్తే సుమారు 40 వేల ఎకరాల వరకు భూమి సాగులోకి వస్తుందని, స్థానికులకు ఉపాధి లభిస్తుందని, వలసలు నివారించవచ్చన్న ప్రజాభిప్రాయం మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కూడా హామీ ఇచ్చారు. కానీ హామీలు స్వార్థపూరిత రాజకీయాల వల్ల నీటి మూటలుగా మారాయి. గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు అమలుకు ప్రభుత్వ యంత్రాంగం ఆసక్తి చూపకపోవడం, రాజకీయ నాయకులు, అధికారులు, ఆక్రమణదారులు తమతమ పాత్రను గణనీయంగా పోషించడంతో కొల్లేరులో కబ్జాదారుల ఆగడాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది.

ఓట్ల రాజకీయాన్ని పక్కనబెట్టి అభయారణ్య చట్టాన్ని (1972) అమలు చేయాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని, కొల్లేరు సరస్సుకు పూర్వ వైభవం తీసుకురావాలని, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని, అక్రమ చేపల సాగును అరికట్టాలని, కొల్లేరు భూములను రక్షించి, కొల్లేటి ప్రజల వలసబాటను నివారించాలని ప్రజలు, ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సరస్సు సహజత్వానికి చర్యలు తీసుకోవాలి

సహజ సిద్ధంగా ఏర్పడిన కొల్లేరు సరస్సు ఆక్రమణలతో కుచించుకుపోతోంది. నీటి నిల్వ తగ్గి మురికి కూపంలా తయారైంది. జల కాలుష్యం నుంచి కాపాడుతూ నీటి ప్రవాహానికి అవరోధం లేకుండా గట్లు తొలగించే చర్యలు చేపట్టాలి. సరస్సు సహజత్వానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

-చింతపల్లి వెంకటనారాయణ, సాహితీ మిత్రులు, కొల్లేరు

ఇంజినీరింగ్ తరగతులు

జాప్యం

ప్రైవేట్ వైపు విద్యార్థుల చూపు

రేపటి నుంచి వెబ్ కౌన్సెలింగ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ ఈఏపీసెట్-2024 ప్రవేశాల ప్రక్రియలో స్వల్ప మార్పుల కారణంగా ఇంజినీరింగ్ తరగతులు జాప్యం కానున్నాయి. తొలి విడత జారీ చేసిన వెబ్ కౌన్సెలింగ్ ప్రకారం ఈ నెల16వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. వెబ్ ఆప్షన్ ఎంపిక ప్రక్రియను ఈనెల 7వ తేదీకి వాయిదా వేయడంతో అభ్యర్థులకు అసౌకర్యం ఏర్పడింది. ఇంజినీరింగ్ కళాశాలలో ఫీజు నిర్ధారణపై స్పష్టత రానందునే కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్టు అధికారులు ప్రకటించారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. యేటా ఏపీలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ జాప్యమవుతూనే ఉంది. దీనికిగల కారణాలను ముందుగా గుర్తించి పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. తెలంగాణలో ఇంజినీరింగ్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. తెలంగాణలో ముందు, ఆంధ్రాలో వెనుక నిర్వహించడం వల్ల రాష్ట్రానికి చెందిన విద్యార్థులు తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ఇంజినీరింగ్ మొదట ఏడాది తరగతులు ప్రారంభమయ్యాయి. ఏపీలో జాప్యానికి అధికారులే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అటు ఆంధ్రప్రదేశ్ ఉన్నతవిద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ నిర్ణయించిన ఫీజులు తక్కువగా ఉన్నాయంటూ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించడంతోనే వెబ్ కౌన్సెలింగ్ జాప్యమైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇంజినీరింగ్ సీట్లకుగాను కనిష్ఠంగా రూ.42 వేలు, అంతకంటే ఎక్కువ ఫీజులు ఉంటే 10 శాతం పెంచుకోవడానికి వీలు కల్పిస్తామని హైకోర్టు తెలిపింది. దీనికి కాలేజీ యాజమాన్యాలు అంగీకారం తెలపాల్సి ఉంది. ఫీజుల వ్యవహారం ముందుగా ఖరారైతే కౌన్సెలింగ్ షెడ్యూల్లో జాప్యం ఉండేది కాదని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

రేపటి నుంచి వెబ్ ఆప్షన్లు

ఏపీలో ఇంజినీరింగ్ సీట్ల భర్తీ కోసం ఈనెల 7వ తేదీ నుంచి 12 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక ఉంటుందని, 17న సీట్లు కేటాయిస్తామని ఏపీ ఈఏపీ సెట్ కన్వీనర్ నాగమణి ఇటీవల వెల్లడించిన విషయం విదితమే. ఈ విడతైనా అధికారులు ప్రకటించిన షెడ్యూలు సక్రమంగా జరుగుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కొత్తగా వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఇవ్వలేదు. మరోవైపు, అన్ని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్ సీట్లనే అత్యధికంగా యాజమాన్యం అందుబాటులో ఉంచింది. సివిల్, మెకానికల్ కోర్సులకు డిమాండ్ తగ్గిపోతోంది. కంప్యూటర్ ఇంజినీరింగ్ సైన్సెస్ (సీఎస్ఈ), దాని అనుబంధ కోర్సులు మాత్రమే ఎంపిక చేసుకునేందుకు అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారు. అవి రాకుంటే ఆ తర్వాత స్థానంలో ఈసీఈ, ఈఈఈ బ్రాంచీల వైపు చూస్తున్నారు. సివిల్, మెకానికల్ బ్రాంచ్‌లపై ఆసక్తి చూపడం లేదు. దీనిని గమనించిన ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు కొంతకాలం నుంచి ఇంజినీరింగ్ సీట్లు పెంచుతున్నాయి. ప్లేస్‌మెంటు ఆశలు చూపి విద్యార్థులను ఆకర్షిస్తూ, అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి.

వంటింటికి ధరల సెగ

(మొదటిపేజీ తరువాయి)

పంటలపై ప్రభావం చూపడం, భారీ వర్షపాతం కారణంగా కొన్ని ప్రాంతాలలో రవాణా అంతరాయాలు వంటి కారణాల కలయిక వల్ల ఇటీవలి పెరుగుదల జరిగిందని మంత్రిత్వ శాఖ వివరించింది. గత ఏడాది కిలో రూ.34 గా ఉన్న టమాటా ధర గురువారం సగటున కిలో రూ.140 గా ఉందని ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. అత్యధికంగా టమాటా ధర ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో కిలో రూ.257 కాగా, ఢిల్లీలో రూ.213, ముంబైలో కిలో రూ.157 గా నమోదయింది. డెహ్రాడూన్‌లో టమాటాతో సహా కూరగాయల ధరలు కిలోకు రూ.300 వరకు పెరగడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మోదీ సర్కార్ అస్తవ్యస్త ఆర్థిక విధానాల వల్లే...

భారతదేశ ఆహార ధరల ద్రవ్యోల్బణం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రాణసంకటంగా మారింది. కేంద్రం అస్తవ్యవస్థ ఆర్థిక విధానాలే ఇందుకు ప్రధాన కారణమని వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. వచ్చే ఏడాది కీలకమైన ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బియ్యం, టమాటా ధరలు భారీగా పెరిగాయి. 69 ఏళ్ల అహ్మద్, దాదాపు 30 సంవత్సరాలుగా బియ్యం మిల్లింగ్ చేస్తున్నాడు. 'నాతో సహా అత్యల్ప నుంచి అత్యధికంగా సంపాదిస్తున్న ప్రతి ఒక్కరూ అధిక ధరలకు బాధపడుతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ సీజన్ ఆహార మార్కెట్లకు గందరగోళంగా ఉంది. గత నెల నుంచి తొలకరి వర్షాలతో పంట దెబ్బతినడంతో టమాటా ధరలు సుమారు 400 శాతం పెరిగాయి. గత ఏడాది కంటే బియ్యం ధర 11.5 శాతం పెరిగింది. 'కొనుగోలు చేయడం ఎలా? అదే నేను అడుగుతున్న ప్రశ్న' అని కర్నాటక రాష్ట్రంలోని మైసూరు సమీపంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో 32 ఏళ్ల వలస కార్మికుడు జీతు సింగ్ అన్నారు. 'టమాటా, బియ్యం, పప్పు అన్ని పెరిగాయి' అని మరో దుకాణదారుడు జయలక్ష్మి మాట్లాడుతూ తన బిల్లులను భరించేందుకు పప్పులు, నూనె, ఇతర నిత్యావసర వస్తువులపై కోత విధించినట్లు తెలిపారు.

రిటైల్ ద్రవ్యోల్బణం మరింత పెరగవచ్చు

గత నాలుగు నెలల్లో తగ్గిన తర్వాత జూన్‌లో పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం, పెరుగుతున్న ఆహార ధరల కారణంగా మరింత పెరుగుతుందని క్రిసిల్ బుధవారం ఒక నివేదికలో అంచనా వేసింది. జులై రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు వచ్చే వారం విడుదల కానున్నాయి. తృణధాన్యాలు, పప్పులు సమీప కాలంలో కూరగాయల ధరలు కీలకంగా పర్యవేక్షిం చదగినవి. గత ఆరు నెలలుగా తృణధాన్యాల ద్రవ్యోల్బణం రెండంకెల్లో ఉంది. ప్రస్తుత ఉత్పాదక ధోరణులను పరిశీలిస్తే, పప్పు ధాన్యాలు హాని కలిగించే స్థితిలో ఉ ఉన్నాయని నివేదిక పేర్కొంది. కొన్ని రకాల బియ్యం ఎగుమతులను పరిమితం చేయడం, గోధుమలపై నిల్వ పరిమితులను విధించడం, సరఫరాలను మెరుగుపరచడానికి ఇతర మార్కెట్ జోక్యాలు వంటి ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలలో ఆహార ద్రవ్యోల్బణం గురించిన ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. ఖరీఫ్‌లో నాట్లు వేసే సమయంలో అధిక వర్షాలు కురవడం కూడా ద్రవ్యోల్బణంపై ఆందోళన పెంచింది. నాట్లు వేసే సమయంలోనే అధిక వర్షాలు కురియడంతో అదనపు నీటిని ఒడిసిపట్టేందుకు రైతులు నాట్లు వేయడంలో జాప్యం చేసినట్లు తెలుస్తోంది. నష్టంపై అధికారిక అంచనాలు వేచి ఉన్నప్పటికీ, విత్తిన పంటలు దెబ్బతిన్నాయని క్రిసిల్ నివేదిక పేర్కొంది.

సెప్టెంబరులో ఉల్లి ఘాటు

(మొదటిపేజీ తరువాయి)

నిల్వ కాలం 1-2 నెలలు తగ్గాయి. ఈ నిల్వలు ఆగస్టు చివరికే తగ్గుముఖం పట్టనున్నాయి. దీంతో సెప్టెంబరు నాటికి సరఫరా తగ్గి... ధరలు పెరగొచ్చు' అని విశ్లేషించింది. అక్టోబరు నుంచి ఖరీఫ్ పంట లభ్యత పెరిగితే ఉల్లి ధరలు మళ్లీ తగ్గుముఖం పడతాయని తన నివేదికలో పేర్కొంది. పండగల సీజను(అక్టోబరు-డిసెంబరు)లో ధరల చలనాలు స్థిరంగా ఉండొచ్చని అంచనా వేసింది. తృణ ధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఇతర కూరగాయల ధరలతో ఇబ్బందిపడిన వినియోగదారులు ఈ ఏడాది జనవరి-మే నెలలో ఉల్లి ధరలు తగ్గడంతో ఊరట చెందారు. ధర లేనందున ఖరీఫ్ సీజనులో తక్కువ పంట సాగుచేశారు. దీంతో ఈ ఏడాది 8 శాతం మేర పంట విస్తీర్ణం తగ్గింది.

ఖరీఫ్ ఉల్లి ఉత్పత్తి 5 శాతం తగ్గింది. వార్షిక ఉత్పత్తి 29 మిలియన్ టన్నులకు చేరొచ్చని అంచనా. ఐదేళ్ల సగటు కంటే ఇది 7 శాతం అధికమని ఆ నివేదిక తెలిపింది. తక్కువ ఖరీఫ్, రబీ దిగుబడి కనిపించినప్పటికీ ఈ ఏడాది ఉల్లి సరఫరా తక్కువగా ఉండకపోవచ్చని, ఆగస్టు, సెప్టెంబరులో వర్షపాతం ఆధారంగా ఉల్లి పంట దిగుబడి ఉంటుందని వెల్లడించింది.

విద్యుత్ సంస్కరణలపై పోరాటం

జనచైతన్య వేదిక సదస్సులో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యుత్ సంస్కరణల అంశమే ప్రధాన అజెండా కావాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. జనచైతన్య వేదిక అధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు- ప్రజలపై భారాలు'అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు శనివారం జరిగింది. జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన విజయవాడలోని దాసరి భవన్‌లో జరిగిన సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ అదానీకి లాభాలు చేకూర్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌పై కేంద్రం ఒత్తిడి తీసుకువస్తున్నదని విమర్శించారు. బొగ్గు కృతిమ కొరత సృష్టించి 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకునేలా చేస్తున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలోని అంశాలను కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకుంటున్నదని ఆరోపించారు. కాసులకు కక్కుర్తి పడటం, 2024లో తిరిగి అధికారంలోకి రావటం కోసం ఎవరిని దెబ్బతీయాలనే ఆలోచనతో జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. విద్యుత్ బిల్లులో అన్ని రకాల చార్జీల పేర్లు తీసేయాలని సూచించారు. స్మార్ట్ మీటర్లు బిగించి ఎక్కువ చార్జీలు వసూలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం లేకపోయినా ప్రైవేటు సంస్థల నుంచి 10శాతం విద్యుత్ కొనుగోలు చేయాలని నిర్ణయించటం దారుణమన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ డిస్కంలు రూ.78 వేల కోట్లు బకాయి పడ్డాయని తెలిపారు. 0.5శాతం అప్పు కోసం స్మార్ట్ మీటర్లు బిగించటానికి ఏపీ ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. 63 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తే రూ.807 బిల్లు వచ్చిందని, ఇలాగైతే సామాన్యులు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. అదానీ, షిర్డీసాయి కంపెనీలు తోడుదొంగలని ఆరోపించారు. రామాయపట్నం పోర్టు నిర్మాణం కోసం చేపట్టిన స్థల సేకరణలో 7వేల ఎకరాలు షిర్డీసాయి కంపెనీకి కేటాయించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం కూతలు, కోతలు, వాతలుగా వ్యవహరిస్తున్నదని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో 8 సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.17,720 కోట్లు అదనపు భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు బి.తులసీదాస్ మాట్లాడుతూ నిలకడైన విద్యుత్ కోసం థర్మల్ పవర్ అవసరం ఉందన్నారు. గిరిజన చట్టాలను ఉల్లంఘించి వారి భూముల్లో పెట్టుబడులు పెడుతున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీలే కాకుండా ఇతర భారాలు మోపబోమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదస్సుకు అధ్యక్షత వహించిన లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల వ్యతిరేక పోరాటంలో భాగంగా 13 ఉమ్మడి జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, ఆర్.రాజేష్ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

పెద్దిరెడ్డి మాఫియా డాన్: బండారు సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మైనింగ్ మాఫియా నడుపుతున్నారని, ఆయన కపట సన్యాసి అని మాజీమంత్రి బండారు సత్యనారాయణ మూర్తి విమర్శించారు. శనివారం టీడీపీ విశాఖ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పెద్దిరెడ్డిపై బండారు మండిపడ్డారు. ఆరు నెలల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఆపై డాన్ పెద్దిరెడ్డి ఎర్రచందనం మాఫియాపై న్యాయ విచారణ జరిపిస్తామన్నారు. వివేకా హత్య కేసులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును బయటకు తేవడాన్ని సీఎం జగన్ భరించలేక పోతున్నారని వ్యాఖ్యానించారు. జెడ్ కేటగిరి భద్రత ఉన్న చంద్రబాబుకు పోలీసు భద్రత కల్పించడంలో విఫలమయ్యారని, తమ నాయకుడిని ఏం చేయాలని అనుకుంటున్నారని సీఎం జగన్‌ను, మంత్రి పెద్దిరెడ్డిని ప్రశ్నించారు. ఎస్పీ రిశాంత్ రెడ్డికి వైసీపీపై అభిమానం ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి జగన్ దగ్గరకు వెళ్లాలన్నారు. యాదవ నాయకుడు రామచంద్ర యాదవ్ ప్రజలకు సేవ చేద్దామని పార్టీ పెట్టుకొని వస్తే ఆయనను చంపాలని పెద్దిరెడ్డి చూశారని బండారు ఆరోపించారు. కేంద్రప్రభుత్వం చొరవ తీసుకొని చంద్రబాబుకు కేంద్ర దళాలతో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పర్యటనలో దాడులపై కేంద్ర హోంమంత్రికి తమ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారన్నారు. అనకాపల్లిలో సెక్షన్ 30 పెట్టింది జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖ పర్యటన వల్లేనా? విసన్నపేట భూములు పరిశీలిస్తారనా? అని ప్రశ్నించారు. దీనిపై మంత్రి అమర్నాథ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విసన్నపేటలో ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారని, లూలూ సంస్థకు కేటాయించిన భూములను కారు చౌకగా కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. లూలూ సంస్థకు కేటాయించిన భూములను పర్యాటక ప్రాజెక్టులకు కేటాయించాలి లేదంటే తెలంగాణ తరహాలో బహిరంగంగా వేలమేయాలని బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు.

చంద్రబాబు తోటపల్లి ప్రాజెక్టు సందర్శనను విజయవంతం చేయండి

కళా వెంకటరావు, అశోకగజపతిరాజు

విశాలాంధ్ర, పార్వతీపురం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9న(బుధవారం) మన్యం జిల్లాల్లోని తోటపల్లి సాగునీటిప్రాజెక్టు సందర్శనకు వస్తున్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకట రావు, మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోకగజపతిరాజు పిలుపు నిచ్చారు. శనివారం పార్వతీపురం నియోజకవర్గం పార్టీ కార్యాల యంలో విజయనగరం, పార్వతీపురం మన్యంజిల్లాల టీడీపీ ఇన్‌చార్జిలు, క్రియాశీలక నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పథకాలు, వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. ఒక్క అవకాశమని చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. టీడీపీ బలపడటాన్ని ఓర్వలేక వైఎస్సార్సీపీ నేతలు రకరకాల కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ఈనెల 8న విజయనగరంకు చంద్రబాబు వస్తారని, అక్కడ మేధావులు, పార్టీ నేతలతో సమావేశమవుతారు. అదేరోజు రాత్రి బస విజయనగరంలో చేస్తారని తెలిపారు. 9న విజయనగరం నుంచి ప్రత్యేక బస్సులో రోడ్డు మార్గం గుండా వయా గజపతినగరం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా తోటపల్లికు మధ్యాహ్నం మూడున్నర గంటలకు చేరుకొని తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును సందర్శన చేస్తారని తెలిపారు. అనంతరం అక్కడ నుంచి వెనుకకు వచ్చి ఉల్లిభద్రలో రైతులతోను, ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన నాయకులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అక్కడ నుంచి రోడ్ షో ద్వారా పార్వతీపురం వస్తారని తెలిపారు. పార్వతీపురం నాలుగు రోడ్ల కూడలిలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఆరోజు పార్వతీపురంలో రాత్రి బస చేస్తారన్నారు. పార్వతీపురంలో మేధావులతో, జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల క్రియాశీలక నేతలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు.

చంద్రబాబు రాజకీయంగా దివాలా తీశారు

మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి

విశాలాంధ్ర -చిత్తూరు: పుంగనూరు ఘటనతో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రాజకీయంగా దివాలా తీశారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. పుంగనూరు ఘటనలో గాయపడిన పోలీసులను శనివారం మంత్రులు చిత్తూరు ఆస్పత్రిలో పరామర్శించారు. వారు మాట్లాడుతూ పుంగనూరులో పక్కా ప్రణాళికతో టీడీపీ శ్రేణులు పోలీసులపై దాడికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాళ్లు కర్రలుతో పోలీసులపై దాడి చేయడం శోచనీయమన్నారు. పుంగనూరులో రూట్ మ్యాప్ ఒక విధంగా ఉంటే మరో మార్గంలో చంద్రబాబు నాయుడు ఎలా వస్తారని ప్రశ్నించారు. కార్యకర్తలను చంద్రబాబు రెచ్చగొట్టడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. గొడవలు సృష్టించాలనే ఉద్దేశంతోనే ముందస్తు ప్రణాళికతో టీడీపీ నేతలు వచ్చారన్నారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదన్నారు. పోలీసులు ఎంతో సమన్వయంగా వ్యవహరించారని చెప్పారు. ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, నగర మేయర్ అముద పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద కుట్రతోనే

మణిపూర్‌లో హింస: జేవీఎస్‌ఎన్ మూర్తి

విశాలాంధ్ర-అమలాపురం: బీజేపీ మతోన్మాద కుట్రలో భాగంగానే మణిపూర్‌లో హింస జరుగుతోందని సీపీఐ ఏపీ సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. గిరిజన మహిళలను అత్యంత పాశవికంగా హింసించి అత్యాచారం చేయడం, వారి కుటుంబ సభ్యులను చంపడం వంటివి మానవజాతికి కళంకమని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఎక్కడైన అత్యాచారం జరిగితే దానిపై మోదీ దేశవ్యాప్త చర్చకు తెరతీసేవారని గుర్తుచేశారు. బీజేపీ పాలనలో అత్యాచారాలు పెరిగినా బీజేపీ ప్రభుత్వం ఎందుకు స్పందించదు? ఎందుకు చర్యలు తీసుకోదు? అని ప్రశ్నించారు. రాజ్యాంగానికి విరుద్ధమైన చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో సీపీఐ సైద్ధాంతిక, రాజకీయ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల రెండోరోజు కార్యక్రమంలో జేవీఎస్ మూర్తి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భూగర్భ నిక్షేపాలను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు ప్రధాని మోదీ మణిపూర్‌లో గిరిజనుల మధ్య గొడవ పెట్టారన్నారు. బూర్జువా పార్టీలైన కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ, మతతత్వ పార్టీ బీజేపీ... అధికారం కోసం చెప్పే అబద్ధాలను, అధికారంలోకి వచ్చాక చేసే మోసాలను ప్రజలకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు వివరించాలని మూర్తి సూచించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలను కోటీశ్వరులను చేస్తానన్న ఆ పార్టీ అధినేత చంద్రబాబు మాటలు నమ్మశక్యంగా లేవన్నారు. సమాజంలో జరుగుతున్న ప్రతి ఘటన, సమకాలీన రాజకీయ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సీపీఐ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజలతో ప్రతి అంశంపై చర్చించాలన్నారు. ప్రచారంలో ఉన్న అవాస్తవాలను, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత సీపీఐ కార్యకర్తలపై ఉందని జేవీఎస్ మూర్తి అన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేత డాక్టర్ చెలికాని స్టాలిన్, నియోజవర్గాల కార్యదర్శులు దేవ రాజేంద్ర ప్రసాద్, అడపా సత్యనారాయణ, శీలం వెంకటేశ్, పెద్దిరెడ్డి రాము, పితాని ఆనంద రావు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్రను విజయవంతం చేయండి

పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రాన్ని కాపాడండి... దేశాన్ని రక్షించండి అని కోరుతూ ఈనెల 17న విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద నుంచి ప్రారంభం కానున్న సీపీఐ బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. శనివారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో జరిగిన సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు సమావేశానికి అధ్యక్షత వహించారు. వనజ మాట్లాడుతూ జగన్, మోదీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి సీపీఐ బస్సు యాత్ర చేపడుతుందన్నారు. దేశంలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి చేటు కలిగించే విధంగా మోదీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలు అవలంభిస్తోందన్నారు. మత విద్వేషాలు రగిలించి మణిపూర్‌లో మారణహోమం సృష్టిస్తున్నారన్నారు. ప్రమాదంలో ఉన్న దేశాన్ని, దేశ ప్రజలను కాపాడవలసిన బాధ్యత ప్రగతిశీల శక్తులపై, కవులు, కళాకారులు పైన ఉందని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి వారిని మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ బస్సు యాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా తమ సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ సీపీఐ బస్సు యాత్ర ఈనెల 22న జిల్లాలో ప్రవేశిస్తుందన్నారు. ఈ సందర్భంగా 22న తణుకులో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా 17, 18 తేదీల్లో జిల్లా వ్యాపితంగా ప్రచార జాతాలు నిర్వహిస్తామన్నారు. తొలుత మణిపూర్ హింసాకాండలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, బొద్దాని నాగరాజు, నెక్కంటి క్రాంతికుమార్, సికిలే పుష్పకుమారి, టి.అప్పలస్వామి, జిల్లా సమితి సభ్యులు బొద్దాని కృష్ణ కిషోర్, మల్లుల శ్రీనివాస్, మండల నాగేశ్వరరావు, నామన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీది దద్దమ్మ ప్రభుత్వం

- దోచుకోవడం, దాచుకోవడం తప్ప మరేమీ రాదు
- యువగళం యాత్రలో లోకేశ్ విమర్శలు

విశాలాంధ్ర-ఈపూరు: ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ ప్రభుత్వానికి దోచుకోవడం, దాచుకోవడం తప్ప మరేమీ రాదని తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. గ్రామీణుల దాహార్తిని తీర్చేందుకు కేంద్రమిచ్చిన నిధులను వాడుకోవడం చేతకాని దద్దమ్మ ప్రభుత్వమిదని వ్యాఖ్యానించారు. జల జీవన్ మిషన్‌లో ఏపీ 18వ స్థానానికి దిగజారడం పాలకపక్ష చేతగాని తనానికి నిదర్శనమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వాటర్ గ్రిడ్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు ఇస్తామని యువగళం పాదయాత్రలో భాగంగా గుంటూరు జిల్లా, ఈపూరు మండలంలోని గ్రామాల ప్రజలకు లోకేశ్ హామీనిచ్చారు. జగన్ హయాంలో పంచాయతీ నిధులు పక్కదారి పట్టాయని, వ్యవసాయం నిర్లక్ష్యానికి గురైందని, రైతులు అప్పుల పాలయ్యారని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం రాగానే రైతులకు గత వైభవాన్ని తెస్తామని, అదనపు నిధులు ఇస్తామని, గిట్టుబాటు ధరలు కల్పిస్తామని వాగ్దానం చేశారు. కూచినపల్లి గ్రామంలోని ఎన్ఎస్‌పీ కాలువపై వంతెన నిర్మిస్తామని, పేదోడి సొంతింటి కలను సాకారం చేస్తామని లోకేశ్ హామీలిచ్చారు. యువగళం పాదయాత్ర శనివారం ఈపూరు మండలం మీదగా బొమ్మరాజుపల్లి గ్రామానికి చేరుకుంది. మణికొండ గ్రామం నుంచి పల్నాడు ప్రాంతానికి బయలుదేరింది. తొలుత వనికుంట గ్రామంలో యాత్రకు ప్రజలు స్వాగతం పలికారు. తమ సమస్యలను లోకేశ్‌కు విన్నవించారు. తాగునీటితో పాటు ఫ్లోరింగ్ సమస్య అనేక ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదని ఆయనతో చెప్పారు. నాలుగేళ్లుగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నట్లు చెప్పారు. సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని లోకేశ్‌ను కోరారు. ఎన్ఎస్‌పీ కాలువపై బ్రిడ్జి లేక ఇబ్బంది పడుతున్నట్లు కూచినపల్లి రైతులు, ప్రజలు చెప్పారు. చుట్టూ తిరిగివ వెళుతూ ఆరు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తుందన్నారు. గ్రామీణుల సమస్యలను విన్న లోకేశ్ తాము అధికారంలోకి వచ్చాక అన్ని సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులతో పాటు మాజీ మంత్రులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైద్య విద్య అంగట్లో సరుకా?

జీవో నంబరు 107, 108 రద్దు చేయాలి

గుజ్జుల ఈశ్వరయ్య, కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): దేశానికి కాబోయే డాక్టర్ల భవిష్యత్తును నాశనం చేయొద్దని, జగన్ మామయ్య వైద్య విద్యను అంగట్లో సరుకులా అమ్మటం దారుణమని, వైద్య విద్యార్థులకు శాపమైన జీవో నంబరు 107, 108 రద్దు చేయాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 'జగన్ మామయ్య నేను మెరిట్ విద్యార్థిని-సీటు కొనలేను-నా భవిష్యత్తు ఏమిటి' అనే ప్ల కార్డులు ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా హాజరయిన ఈశ్వరయ్య, కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్య సీట్ల భర్తీలో వ్యాపారానికి తెరలేపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను అందని ద్రాక్ష లాగా దూరం చేస్తోందని విమర్శించారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూ నేడు వైద్య కళాశాలలను డిమార్ట్, మోర్ లాంటి సరుకుల దుకాణాలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడానికి తీసుకువచ్చిన జీవో నంబరు 107,108 రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మూడు కేటగిరీలుగా సీట్లను భర్తీ చేసి, వాటిలో 50 శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ కేటగిరీలకు కేటాయించడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధ్వజమెత్తారు. 25 శాతం మాత్రమే రిజర్వేషన్ సీట్లు కేటాయించడం సరికాదని అన్నారు. 2014 నుంచి 2024 సంవత్సరం వరకు మెరిట్ సాధించిన ఆంధ్ర రాష్ట్ర విద్యార్థులకు తెలంగాణలోని వైద్య కళాశాలల్లో సీట్లు పొందడానికి అవకాశం ఉన్నా, ఆంధ్రా కళాశాలల్లో తెలంగాణ విద్యార్థులు మెరిట్ ద్వారా సీట్లు పొందడానికి అవకాశం రెండు సంవత్సరాలు ఉన్నప్పటికీ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అక్రమ జీవో నంబరు 72 ను అమలు చేశారని తెలిపారు. దీంతో మెరిట్‌తో సాధించే సీట్లను పొందే అవకాశాన్ని ఎక్కువ శాతం ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థులు కోల్పోయారని, వారి జీవితాలతో చెలగాటమాడారని అన్నారు. వైద్య విద్యార్థులకు మెరిట్ ఆధారంగా ఉచితంగా విద్యను అందించకుండా ఏ కేటగిరి, బి కేటగిరి, సి కేటగిరీలుగా విభజించి, వాటికి వెలకట్టి నడి బజారులో తూకం వేసి, వేలం వేసి ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నించారు. డబ్బు సంచులతో పోటీపడే వారికి మాత్రమే వైద్య విద్య అందించే విధానాలను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ఏవిధంగా అమ్మేస్తుందో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కూడా అదే పంథాలో ప్రభుత్వ విద్యను కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ అందిన కాడికి దోచిపెడుతున్నారని అన్నారు. వైద్య విద్యను వ్యాపారం చేస్తున్న ఈ వినిమయ సంస్కృతిని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలుగా, విద్యార్థులుగా చేస్తున్న పోరాటాలకు మాజీ విద్యార్థి నాయకులుగా, ది పేరెంట్స్ ఆఫ్ అసోసియేషన్‌గా మద్దతు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ప్రజానాట్యమండలి బృందం 'హలో స్టూడెంట్స్ హౌ ఆర్ యు, ఆఫ్టర్ స్టడీస్ హూ ఆర్ యు' అనే పాటతో విద్యార్థులతో మమేకమై ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్నటువంటి ప్రభుత్వ విద్యా రంగాన్ని ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అందినకాడికి దోచిపెడుతున్న విధానాలను ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వల్లం రాజేంద్రప్రసాద్, విజయవాడ నగర సహాయ కార్యదర్శి చందు, రాకేష్, కార్తీక్, చింటు, సన్నీ, వైద్య విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విజయవాడలో మహాధర్నా

జయప్రదానికి ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతులు, కౌలు రైతుల డిమాండ్ల సత్వర పరిష్కారానికి, ప్రతి ఎకరానికి రూ.10వేలు సాగు సాయానికి డిమాండ్ చేస్తూ సోమవారం విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం శనివారం పిలుపు నిచ్చింది. 7వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద మహాధర్నా జరుగుతుందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్షులు ఎ.కాటమయ్య, ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో ఇస్తున్నట్లుగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రతి రైతుకు రూ.10వేల సాగుసాయం అందించాలని, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని, పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చుల దృష్ట్యా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఉపకరణాలను 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారానికి చేపట్టే ధర్నాలో పెద్దసంఖ్యలో పాల్గొనాలని రైతాంగానికి నాయకులు పిలుపునిచ్చారు.

విద్యారంగ సమస్యలను పట్టించుకోని నంద్యాల జిల్లా డీఈఓ

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు

విశాలాంధ్ర - నంద్యాల: విద్యారంగ సమస్యలను జిల్లా విద్యాశాఖాధికారిణి అనురాధ గాలికి వదిలేశారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు ధ్వజమెత్తారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్న అధికారులను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండు చేశారు. నంద్యాల జిల్లా విద్యాశాఖ కార్యాలయ ముట్టడిలో పాల్గొన్న జాన్సన్ బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో టీచింగ్-నాన్ టీచింగ్, పీఈటీ పోస్టులు భర్తీ చేయాలని, కేంద్రియ విద్యాలయాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. అలా చేయని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ధనుంజయ్, నంద్యాల జిల్లా ఆఫీస్ బేరర్స్ ప్రతాప్, సురేష్, ఎర్రిస్వామి, ఉదయ్, మహానంది, నాయకులు దినేష్, వీరేంద్ర, మనోజ్, సిద్ధుతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ నాలుగు దుష్ట చతుష్టయాలు: తులసీరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇటీవల వచ్చిన వర్షాలు, వరదలకు నిరాశ్రయులైన బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోలేదు, కనీసం పరామర్శించలేదని కాంగ్రెస్ నేత తులసీరెడ్డి విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ, జనసేన, వైసీపీ, బీజేపీ పార్టీలు దుష్ట చతుష్టయాలన్నారు. రాబోయే ఎన్నికలలో ఆ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయించిన బీజేపీ ప్రభుత్వం... సుప్రీంకోర్టు తీర్పుతో సిగ్గు పడాలని దుయ్యబట్టారు. విశాఖస్టీల్ ప్లాంట్ విషయంలో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. మణిపూర్‌లో పరిస్థితులను చక్కబెట్టడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తులసీరెడ్డి విమర్శించారు. సమావేశంలో నాయకులు వినయ్ కుమార్, గురునాథం, డాక్టర్ జంధ్యాల శాస్త్రి, నాగేశ్వరరావు, ఖాజా మొహిద్దీన్, కొమ్మినేని సురేశ్ పాల్గొన్నారు.

బోధన, పరిశోధనల్లో ఎస్ఆర్ఎం అగ్రగామి

విశాలాంధ్ర-మంగళగిరి: అంతర్జాతీయ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో కొనసాగుతున్న విద్యా విధానం ప్రశంసనీయమని ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి కొనియాడారు. బోధన, పరిశోధనల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆంధ్ర ప్రదేశ్‌లో ఏర్పాటు కావడం అభినందనీయమని అన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శనివారం వివిధ దేశాల రాయబారులు, దౌత్య, విద్యావేత్తల ప్రత్యేక సమావేశం జరిగింది. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజకుమార్ అరోరా జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరయిన హేమచంద్రారెడ్డి విద్యార్థులు, విద్యావేత్తలనుద్దేశించి ప్రసంగించారు. గత ఏడాది ఎంసెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన అధిక శాతం విద్యార్థులు ఇంజినీరింగ్ చదువుల కోసం ఏపీ ఎస్ఆర్ఎంను ఎంపిక చేసుకోవడం విశేషమన్నారు. యూనివర్సిటీ అందిస్తోన్న నాణ్యమైన విద్యకు ఇదే నిదర్శమన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జొనాథన్ మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ రంగంలో భారత్ పురోగమిస్తుందని, దేశీయంగా ఉన్న ఎస్ఆర్ఎం వంటి విశ్వవిద్యాలయాలు ఇందుకోసం ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. టెక్నాలజీ అభివృద్ధిని శామ్యూల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

భారతదేశ విద్యావిధానం భేష్

ప్రపంచంలో అత్యున్నత విద్యను భారతదేశం అందిస్తోందని గాంబియా హైకమిషనర్ ముస్తఫా జవర్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్య అవకాశాలపై చర్చా గోష్టి నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ముస్తఫా జవర్ మాట్లాడుతూ భారత్‌లో చదువుకున్న గాంబియా విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందడమే కాకుండా తమ దేశంలో ఎంతో మందికి కొలువులు అందించే స్థాయికి ఎదిగారన్నారు. గాంబియా, భారత్‌ల మధ్య దృఢ బంధం ఉందన్నారు. అనంతరం గాంబియా విద్యార్థుల ప్రయోజనార్థం తయారు చేసిన అవగాహన ఒప్పందంపై ఎస్ఆర్ఎం, గాంబియా హైకమిషనర్ సంతకాలు చేశారు.

ఆసక్తికరంగా సాగిన బృంద చర్చలు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్యానల్ చర్చల్లో వివిధ దేశాల రాయబారులు పాల్గొన్నారు. అంతర్జాతీయంగా వివిధ యూనివర్సిటీల్లో లభిస్తున్న ఉన్నత విద్య, సాంస్కృతిక వ్యవహారాల చర్చకు సంధానకర్తగా కేంద్ర ప్రజాసంబంధాల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ హర్షా భార్గవి వ్యవహరించారు. ప్యానలిస్టులుగా కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ సురేశ్ చుక్కపల్లి, కెనడియన్ హైకమిషనర్ విక్రం జైన్ తదితరులు పాల్గొన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమకుమార్, యూనివర్సిటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ హయ్యర్ స్టడీస్ డైరెక్టర్ డాక్టర్ నాగ శ్వేత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పంచాయతీ నిధుల దోపిడి: పవన్

విశాలాంధ్ర - మంగళగిరి: గ్రామాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించిన నిధులను ప్రభుత్వం కనీసం ఆయా పంచాయతీలకు చెప్పకుండానే దారి మళ్లిస్తోందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. దీనిని బహిరంగ ప్రజా దోపిడిగా భావించాల్సి ఉంటుందని ఆయన మండిపడ్డారు. పంచాయతీల సమస్యలపై రాష్ట్రవ్యాప్త సర్పంచులతో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో వివిధ అంశాలమైన చర్చ అనంతరం పవన్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి గ్రామాలే పట్టుగొమ్మలు అన్న మౌలిక సూత్రాన్ని వైసీపీ పూర్తిగా కాలరాస్తోందన్నారు. గ్రామీణ వ్యవస్థను క్రమక్రమంగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని, గతంలోనూ ప్రభుత్వాలు గ్రామీణ వ్యవస్థలను పూర్తిగా పక్కనపెట్టే ఆలోచనలు చేసినా.. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇది తారస్థాయికి చేరిందన్నారు. చిన్నప్పుడు పాఠాల్లో గ్రామాలు, వాటిఅభివృద్ధి నిధులు మీద చదువుకున్న మొత్తం సారాంశం ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో విభిన్నంగా అనిపిస్తుంది. రాజకీయ ఒత్తిళ్లతో గ్రామ సభలు నిర్వహణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కనీస అభివృద్ధికి నిధులు లేవు.. మౌలిక సదుపాయాల ఊసే లేదు.. గ్రామీణ వ్యవస్థ అత్యంత దారుణంగా తయారైందన్నారు. గ్రామ సభలు జరపకపోతే సర్పంచుల అధికారం పోయే అవకాశం ఉంది.. చాలాచోట్ల వాటిని పటిష్టంగా అమలు చేస్తున్న దాఖలాలు లేవని పవన్ అన్నారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులు కేటాయింపులు జరగడం లేదు. అవి పంచాయతీలకు అందడం లేదు. ఇలా అయితే గ్రామ స్వరాజ్యం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. గ్రామ అభివృద్ధి సమగ్ర స్వరూపం కచ్చితంగా జనసేన పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రత్యేకంగా దృష్టి పెడతాం. కేరళ పంచాయతీ విధానం ప్రత్యేకం, పంచాయతీలను బలోపేతం చేసే విషయంలో కేరళ ప్రభుత్వం ఉత్తమంగా నిలుస్తోంది. వివిధ పథకాలకు నిధులను కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతుంది.. పంచాయతీ సర్పంచులకు పంచాయతీ ఖాతాలో ప్రత్యక్షంగా నిధులు రావాల్సి ఉండగా..అన్నీ తమ కనుసైగలో జరగాలి అని వైసీపీ భావిస్తోందన్నారు.

సంపాదకీయం

వికటాట్టహాసం చేస్తున్న విద్వేషం

బీజేపీ నాయకత్వంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విద్వేషం, విధ్వంసం వికటాట్టహాసం చేస్తున్నాయి. దేశంలో ఏ ఎన్నికలు జరిగినా హింసాయుత ఘర్షణలు జరుగుతున్నాయి. సమాజ విభజనను బీజేపీ ప్రభుత్వం దాదాపు శాశ్వతం చేసింది. దాదాపు మూడు నెలలుగా ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రెండు జాతుల మధ్య పోరాటం, విధ్వంసం విచ్చలవిడిగా సాగాయి. కంచే చేనుమేసిన చందంగా పాలకులే మణిపూర్ కల్లోలానికి కారణమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తాయి. శాంతి భద్రతలు కాపాడవలసి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా, నిష్క్రియాపరత్వంగా ఉంది. ఇప్పటికీ ప్రధాని నరేంద్రమోదీ అక్కడ మంటలు ఆర్పేందుకు ప్రయత్నించడం లేదు. మణిపూర్ కొండ కోనల్లో నివసించే కుకీ గిరిజనులను వెళ్లగొట్టి అక్కడున్న విలువైన ఖనిజ నిక్షేపాలను తవ్వుకునేందుకు కార్పొరేట్లకు అప్పగించడానికి వీలుగా అటవీ పరిరక్షణ చట్టాన్ని సైతం సవరించారు. ఇక తాజాగా హరియాణాలో విద్వేషపు చిచ్చురేగింది. శోభ యాత్ర పేరుతో విహెచ్‌పి, బజరంగ్‌దళ్ కార్యకర్తలు మసీదు ఎదుట నిల్చొని ముస్లింలను రెచ్చగొట్టారని దీంతో అల్లర్లు చెలరేగాయన్నది వాస్తవం. అయితే ముస్లింలు ప్రతి ఘటించారని తెలుస్తోంది. నూహ్, గురుగ్రాం ప్రాంతాలలో అల్లర్లు జరిగాయి. ఏడుగురు చనిపోయారని, వీరిలో మసీదులో సమాజ్ చేసే మత గురువు చనిపోయారని, రాష్ట్ర ప్రభుత్వం ధృవీకరించింది. ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుని, విహెచ్‌పి, బజరంగ్‌దళ్ కార్యకర్తల ప్రదర్శనను అనుమతించాక కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి ఉంటే విద్వేషం, విధ్వంసం చోటు చేసుకోకుండా ఉండేవి. మత ప్రదర్శనకు ముందే సోషల్‌మీడియా హెచ్చరిస్తూ వీడియోను ప్రసారం చేసింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే అల్లర్లు జరిగాయని హింసాకాండ జరగడానికి ముందు పరిణామాల క్రమాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. ముందే తెలిసినా ఎందుకు నివారణ చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి ఖట్టరు సమాధానమివ్వాలి.

ఎన్నికలకు ముందు అల్లర్లకు ముందుగా పథకం రూపొందించుకొని అమలు జరిపేందుకు ఈ విద్వేషపు, విచ్ఛిన్నకర శక్తులు రెడీగా ఉంటాయి. ఆర్‌ఎస్‌ఎస్ నుంచి వచ్చిన ముఖ్యమంత్రి ఇందుకు భిన్నంగా ఆలోచించి ఉంటే రెండు మతాల ప్రజల మధ్య హింసాయుత ఘర్షణలు జరిగి ఉండేవి కావు. ఈ ఏడాది చివరిలో మూడు రాష్ట్రాలు– మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్, రాజస్థాన్ అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. మధ్యప్రదేశ్‌లో బీజేపీ తక్కిన రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నాయి. మధ్యప్రదేశ్ ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టక్కుటమారి మాయాజాలంతో బీజేపీ కూలదోసి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి దర్యాప్తు సంస్థలను ధన బలాన్ని ఉపయోగించి చాలా రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలను కూలదోసి తమ ప్రభుత్వాలను బీజేపీ నెలకొల్పిన చరిత్ర ఉంది. తమవి డబల్ ఇంజిన్ ప్రభుత్వాలని ప్రచారం చేస్తున్న రాష్ట్రాల్లో మత చిచ్చు, అల్లర్లు, హింసాకాండ జరుగుతున్నది. కర్నాటకలోనూ డబల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని, ధన బలం, బుజ బలంతోనూ, మెజారిటీ హిందువులను ఆకట్టుకొని మాయోపాయంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చివేసి బీజేపీ తమ ప్రభుత్వాన్ని నెలకొల్పుకున్నది. తాజాగా అసెంబ్లీ ఎన్నికలు జరిగే నాటికి దేశంలోనే అత్యధిక అవినీతి ప్రభుత్వం అన్న "ఘనత" సాధించారు. ఫలితంగా ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలైంది. ఈ విషయాలను కావాలని మరిచినట్టు నటిస్తున్న బీజేపీ నాయకుల ప్రచారాన్ని ఎలా నమ్ముతారు?

హరియాణాలోని నూహ్ నగరంలో గురువారం అర్థరాత్రి కూడా రెండు మసీదులపై దాడిచేసి విధ్వంసం చేశారు. గతంలో విధ్వంస కాండలో ముఖ్య నిందితులైన బజరంగ్‌దళ్ నాయకులు మోనుమనెసర్, బిట్టు బజంగిలు తాజా అల్లర్లకు కుట్రలు పన్నారు. నకిలీ వీడియో తీసి దోషులు ముస్లింలన్నట్టు ప్రచారం చేశారు. వీరిద్దరు దొరక్కుండా తప్పించుకొని తిరుగుతున్నారని పోలీసులు చెప్తున్నారు. కేసును ఎటైనా మార్చే శక్తి పోలీసులకూ ఉంటుంది. తాజాగా జరిగిన హింసాకాండ అల్లర్లకు ముందు ఫిబ్రవరిలో జరిగిన దాడులకు గురైన ఇద్దరు వ్యాపారుల మృతదేహాలు ఇప్పుడు భివానిలో కనిపించాయని పోలీసులు చెప్తున్నారు. వీరిని అపహరించుకుపోయి చంపేశారని పోలీసులు అంటున్నారు. విద్వేష ప్రసంగాలు చేస్తే పోలీసులు తమంతట తామే కేసులు నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ విద్వేష ప్రసంగాలు, వ్యాఖ్యలు, విధ్వంసాలు ఆగడంలేదు. విద్వేష ప్రసంగాలు నివారించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకోవాలని సుప్రీంకోర్టు కోరింది కానీ మైనారిటీలపై విషం గక్కడం ఆగడంలేదు. మణిపూర్, హరియాణాలలో చోటు చేసుకున్న హింసాకాండ, అల్లర్లు ఇతర ప్రాంతాలకు విస్తరింప చేయాలన్న కుట్ర కూడా ఉందని వార్తలు వచ్చాయి. దేశంలో అల్లర్లు, అశాంతి నెలకొని ఉన్న సమయంలోనూ మనది వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూడవ స్థానంలో ఉంటుందని మోదీ తదితర నాయకులు ఎన్నికల్లో గెలవడానికి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. యుద్ధం కారణంగా ఆర్థిక వృద్ధి రానున్న కాలంలోనూ మాంద్యంలో ఉంటుందని ప్రపంచ బ్యాంకు ఐఎంఎఫ్‌లు అంచనా వేశాయి. ఒకవైపు దేశంలో 25 కోట్ల మంది పేదరికంలో ఉన్నారని అనేక సర్వేలు చెప్తున్నప్పటికీ మోదీ ప్రభుత్వం పేదరికం ఎక్కడుందని ప్రశ్నిస్తోంది. పేదరికం లేకపోతే 80 కోట్ల మందికి ధాన్యం అందిస్తున్నామని ప్రభుత్వం ఎందుకు ప్రచారం చేసు కుంటోంది. బీజేపీ, సంఘ్ పరివార్, దాని అనుబంధ సంస్థలకు విడదీయలేని సంబంధాలున్నాయి. అందువల్లనే కుట్రలు, విధ్వంసాలకు కారణమైన సంస్థలపైన ఎటువంటి చర్యలు తీసుకోకపోగా ప్రోత్సహిస్తున్నాయన్న తీవ్ర విమర్శలను బీజేపీ ఎదుర్కొంటోంది. సంఘ్ పరివార్, దాని తోక సంస్థలు గోరక్షణ పేరుతో అనేకమంది మైనారిటీలను హతమార్చారు. మనది ప్రజాస్వామ్య రిపబ్లిక్ అని రాజ్యాంగంలో రాసుకున్నాము. అన్ని వ్యవస్థలను మోదీ తన అధీనంలోకి తెచ్చుకుని ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాలనను సరిస్తూ దేశాన్ని హిందూరాష్ట్రంగా మార్చేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను, బ్యాంకులను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని బీజేపీ కంకణంకట్టుకుంది. వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు అప్పగించి రైతులను కూలీలుగా మార్చేందుకు ప్రయత్నించారు. రైతులు సంవత్సరంపైగా వీరోచిత పోరాటం చేయడంతో ప్రస్తుతానికి ముప్పు తప్పింది. ఇప్పుడు 2024లో జరగనున్న లోకసభ ఎన్నికల్లో గెలిచి మూడోసారి ప్రధాని కావడానికి మోదీ అబద్దాల ప్రచారాన్ని మారుమోగిస్తున్నారు. స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజా సంక్షేమాన్ని రక్షించుకోవాలంటే కేంద్ర పాలకుల ఎత్తుగడలను చిత్తుచేసి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నెలకొల్పాలి.

బీజేపీ, సంఘ్‌పరివార్‌కు సుప్రీంకోర్టు షాక్

విద్వేష, ప్రతీకార రాజకీయాలకు సుప్రీంకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పు తీవ్ర షాక్ ఇచ్చింది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నేరస్థుడిగా నిర్ధారించే రెండేళ్ల జైలు శిక్ష విధించిన గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైందికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాహుల్ విధించిన శిక్షను సుప్రీం నిలుపుదల చేసింది. అలాగే లోకసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించింది. ఈ తీర్పు న్యాయవ్యవస్థపైన, సుప్రీం కోర్టుపైన ప్రజలకు నమ్మకాన్ని పెంచింది. నాలుగేళ్ల క్రితం 2019లో కర్నాటక ఎన్నికల ప్రచారసభలో రాహుల్ వ్యాఖ్యలు నేరపూరితమైనవని బీజేపీ నాయకుడు, గుజరాత్ మంత్రి పూర్ణేష్ రాహు రాహుల్‌పైన గుజరాత్ కోర్టులో పరువునష్టం కేసు వేశారు. చాలా స్వల్ప వ్యాఖ్యలను ఆధారం చేసుకుని కేసు దాఖలు చేశారు. మోదీ ఇంటిపేరు గలవారంతా దొంగలు అవుతారెందుకో అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య ప్రధానమంత్రి పరువుకు నష్టం కలిగించిందని పూర్ణేష్ మోదీ భావించి కేసు దాఖలు చేవారు. దీనిపై గుజరాత్ ట్రయల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి విచారించి కింది కోర్టులు విధించిన శిక్షను ధృవీకరించారు. దీనితో రాహుల్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

తాను ఏతప్పు చేయలేదని, శిక్షను రద్దుచేసి లోకసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయమూర్తులు బిఆర్ గవాయ్, పిఎస్ నరసింహ, సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. అంతేకాదు, నేరస్థుడిగా నిర్ధారించడానికి అవసరమైన ఆధారాలు లేకుండా రెండు సంవత్సరాలు జైలుశిక్ష విధించారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నేరం చేసినట్లు ధృవీకరించడంలో ట్రయల్ కోర్టు శిక్ష విధించడానికి కొన్ని కారణాలను పేర్కొన్నది. అనంతరం గుజరాత్ హైకోర్టు రాహుల్‌కు ట్రయల్ కోర్టు విధించిన శిక్షపై స్టే విధించడానికి తిరస్కరించింది. కిందికోర్టు ఇచ్చిన రెండేళ్ల శిక్ష ధృవీకరించడానికి తగిన కారణాలు చూపలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాదు గుజరాత్ హైకోర్టు తీర్పు ఇచ్చినవెంటనే లోకసభ కార్యదర్శి రాహుల్ లోకసభ సభ్యత్వాన్ని రద్దుచేయడంలో తొందరపాటు ఉందని కూడా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

సుప్రీం తీర్పు తర్వాత రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించడానికి, రాహుల్‌ను లోకసభలో ప్రవేశానికి అవకాశంఉంది. ఇది కాంగ్రెస్‌కు సంతోషకరమైన తీర్పు అయినప్పటికీ, ఎంతకాలం పడుతుందో తెలియదు. లోకసభ కార్యదర్శికి అధికారం ఉన్నప్పటికీ మోదీ-అమిత్ షాల అనుమతిలేకుండా లోకసభ సభ్యత్వం పునరుద్ధరిస్తారా? ఇప్పటికే కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ లోకసభ స్పీకరు ఓం బిర్లాను కలుసుకుని రాహుల్ లోకసభ సభ్యత్వం పునరుద్ధరించమని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు ఇంకా రాహుల్‌పై నేరస్థ కేసులు ఉన్నందున ఆయన పార్లమెంటులో ప్రవేశించడానికి అవకాశం ఉండదని వ్యాఖ్యానించడం పరిగణలోకి తీసుకోవలసిన అంశం.

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలకు ఎదురుదెబ్బ

గత తొమ్మిదేళ్ల కాలానికిపైగా బీజేపీ పాలనలో విద్వేష రాజకీయాలు నడపడం, మెజారిటీ మతవాదాన్ని ముందుకు తీసుకువచ్చి మత, కుల, విభజన తీవ్రతరం చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రధాన వాగ్దానాలలో ఒక్కటీ అమలు చేయకపోగా సమాజాన్ని అల్లకల్లోలానికి గురిచేశారు. రైతులకు రెట్టింపు ఆదాయం పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని వాగ్దానం చేసి వ్యవసాయాన్ని కుదేలుపరిచే మూడు చట్టాలు తెచ్చి, రైతుల మహత్తర ఉద్యమంతో మరో మార్గం లేక వాటిని ఉపసంహరించుకున్నారు. మోదీ పాలన అనేక అంశాలలో విఫలమైంది.

టి. వి. సుబ్బయ్య

యుసిసిపై ఏకాభిప్రాయం అవశ్యం

కూనంనేని సాంబశివరావు

ఉమ్మడి పౌరస్మృతి(యుసిసి) పర్సనల్ లా(వ్యక్తిగతచట్టం) అనగా ఆయా మతాల విశ్వాసాలు, ఆస్తి హక్కులు, వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం, మనోవర్తి, సంరక్షణ పొందు పరిచిన చట్టం. ఇప్పటివరకు హిందూ వివాహ చట్టం (1955), ఇండియన్ క్రిష్టియన్ యాక్ట్-1872, పార్శీ వివాహ విడాకుల చట్టం (1935), షరియత్ యాక్టు (ముస్లిం పర్సనల్ లా) 1937, ఇతర అనేక జాతులకు సంబంధించి, స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ లాంటి అనేక విడివిడి చట్టాలున్నాయి. ఈ వ్యక్తిగత చట్టాలు (పర్సనల్ లాస్) అన్నింటిని ఒకే చట్టంగా తీసుకురావాలనే ప్రతిపాదనే ఉమ్మడి పౌరస్మృతి. ఈ క్రమంలో ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు సంబంధించి ప్రజల అభిప్రాయాలు కోరుతూ 22వ లా కమీషన్ జూన్ 14వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చింది. ఇప్పటివరకు దాదాపు కోట మంది తమ అభిప్రాయాలను కమీషన్‌కు తెలియపర్చారని కేంద్ర న్యాయశాఖ మంత్రి ప్రకటించారు. దీనికి ముందు 21వ లా కమీషన్ 2018లో విడుదల చేసిన నివేదికలో "ప్రస్తుతం యుసిసి అవసరం లేదు-వాంఛనీయం కూడా కాదు, ముందుగా లింగ వివక్షత" అంతం చేయడానికి, అసమానతలను తొలగించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపింది.

ఈ నివేదిక అమలులో ఈనాటికి ఇసుమంత పురోగతి లేదు. లింగ వివక్ష ఈనాటికి కొనసాగుతూనే ఉంది. అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. కోటిమంది తమ అభిప్రాయాలను వెలిబుచ్చారంటే ఉమ్మడి పౌరస్మృతిపై అనుకూల, విరుద్ధమైన భావాలు ఎన్ని ఉన్నాయో అర్థమవుతున్నది. లోకసభ ఎన్నికలకు ముందు అభిప్రాయాలు కోరడమంటే ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ఆశించి భావోద్వేగ అంశాలపైన ప్రజల్లో విభజన తీసుకొనివచ్చి తద్వారా రాజకీయ లబ్ది పొందే కుట్ర ఇందులో ఇమిడి ఉన్నది. ప్రతి ఎన్నికల ముందు ఏదో ఒక భావోద్వేగ అంశాన్ని లేవనెత్తి ఓట్ల రాజకీయాలు చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య. రామమందిరం, ట్రిపుల్ తలాక్, మధురలో కృష్ణ మందిరం, ముస్లిం రిజర్వేషన్లు లాంటి ఉదాహరణలు కోకొల్లలు. ఈ అంశాలన్ని ప్రస్తుతం మరుగునపడిపోయాయి. ఇప్పుడు కొత్త అస్త్రం ఉమ్మడి పౌరస్మృతి.

ఆయా మతాలకు వారివారి వ్యక్తిగత చట్టాలు ఉన్నాయని మనకు తెలుసు. ఉమ్మడి పౌరస్మృతి ద్వారా మెజార్టీ మతం వ్యకిగత చట్టాలను తమపై రుద్దుతారనే భావన మైనార్టీ మతాల్లోనూ, వివిధ జాతుల్లోనూ, తెగల్లోనూ ఉంది. ఈ అంశంపై ఏకాభిప్రాయం, అంగీకారం ఉమ్మడి పౌరస్మృతి అమలుచేస్తే దేశ భవిష్యత్తుకు ప్రమాదకరం. ఉమ్మడి పౌరస్మృతి పేరుతో దేశ ప్రజలలో అనవసర భయాందోళనలు, గందరగోళం తలెత్తకుండా ఆయా మతాలకు సంబంధించిన వ్యక్తిగత చట్టాలలోని బహుభార్యత్వం, మరేదైన దురాచారాన్ని అంతమేరకు తొలగించవచ్చును. గతంలో బాల్యవివాహాలు, ట్రిపుల్ తలాక్, వరకట్నాలు, సతీసహగమనం లాంటి దురాచారాలను నిషేధించిన విధంగా ఇప్పుడు కూడా అటువంటి దురాచారాలను తొలగించవచ్చును.

రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లోని 44వ అధికరణ ఉమ్మడి పౌరస్మృతి కోసం ప్రయత్నించాలని సూచించింది. ఇది సూచన మాత్రమే, మరోవైపు ఎవరి మతాచారాన్ని వారు ఆచరించే హక్కు కలిగి ఉండవచ్చునని ప్రాథమిక హక్కులలో అదే రాజ్యాంగంలో పొందుపర్చారు. రాజ్యాంగంలోని 25 నుండి 28 వరకు ఆర్టికల్స్ ప్రతి వ్యక్తికి తమ తమ మతవిశ్వాసాలను కొనసాగించే ప్రాథమిక హక్కు కల్పించింది. రాజ్యాంగంలోని 4వ భాగంలో అధికరణ 36 నుండి 51 వరకు ఆదేశిక సూత్రాలను పొందుపర్చారు. అవన్నీ భారతదేశం నవీననాగరిక దేశంగా, ఆదర్శరాజ్యంగా అవతరించేందుకు మార్గదర్శకాలు. వాటిలో కేవలం యుసిసి మాత్రమే గాకుండా అనేక ఇతర అంశాలు కూడా ఉన్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో సహా ఇతర కార్మికులందరికి గౌరవంగా జీవించేందుకు (అధికరణ 43), రాజ్యాంగం అమలులోకి వచ్చిన పదేళ్ళల్లోనే 14 ఏండ్ల లోపు పిల్లలందరికి ఉచిత, తప్పనిసరి విద్యను కల్పించడం (అధికరణ 45), ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీనవర్గాల విద్య, ఆర్థిక ప్రయోజనాలను ప్రోత్సహించడం (అధికరణ 46), ప్రజారోగ్యాన్ని, జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం (అధికరణ 47) స్త్రీ, పురుషులకు సమానపని, సమాన వేతనం, ఆదాయ అసమానతలు తగ్గించడం తదితర అంశాలు ఆదేశిక సూత్రాలలో పొందుపరచడమైంది. వాటిని అమలు చేయాల్సిన బాధ్యతను విస్మరించి ప్రజల మధ్య చిచ్చుపెట్టే యుసిసిని మాత్రమే బీజేపీ ఎందుకు ఎంచుకుంటున్నది. ఆదేశిక సూత్రాలలోని యుసిసి అంశాన్ని ముందుకు తీసుకొచ్చి ఒకే కుటుంబంలో రెండు చట్టాలు ఉండకూడదని భారతదేశం మొత్తానికి ఒకే ఉమ్మడి పౌరస్మృతి అమలు చేయాలని ప్రధాని తన వాగాడంబరంతో రాజకీయ లబ్ధిపొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఒకే కుటుంబంలో అన్న హిందూ మతం, తమ్ముడు క్రైస్తవ మత విశ్వాసకులుగా ఎన్ని కుటుంబాలను మనం చూడటం లేదు. వివాహ పద్ధతులలో సాంప్రదాయక వివాహాలతోపాటు వివిధ రీతులలో రిజిస్ట్రేషన్, స్టేజీ వివాహాలు జరగడం లేదా? ఒక ప్రాంతంలోనే ఒకే భాష మాట్లాడే వారిలోనే వివాహ పద్ధతులు, మరణించిన మనిషి అంత్యక్రియలు వివిధ పద్ధతులలో జరగడం మనం చూస్తున్నదే కదా. ఇటువంటి అనేక అంశాలను దృష్టిలో పెట్టుకొని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పౌరస్మృతి ఐచ్ఛికం మాత్రమేనని రాజ్యం తక్షణమే దానిని అమలులోకి తీసుకురావల్సిన అవసరం లేదన్నారు. వివిధ సమూహాల అంగీకారం ద్వారానే ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించిన చట్టాలను చేసేందుకు అవకాశం కల్పించడమైందని వివరించారు.

ఉమ్మడి పౌరస్మృతిని ముస్లింలు వ్యతిరేకిస్తున్నారని, వీరిలో బహుభార్యత్వాన్ని రూపుమాపేందుకని ప్రచారం చేస్తున్నారు. ముస్లిం జనాభా పెరుగుతోందని తప్పుడు ప్రచారం జరుగుతోంది. జాతీయ కుటుంబ సర్వే 2019-20ప్రకారం వివిధ మతాలలో బహుభార్యత్వం కొనసాగుతున్నది. క్రైస్తవులలో 2.1శాతం, ముస్లింలలో 1.9శాతం, హిందువులలో 1.3శాతం, ఇతర మతాలలో 1.6శాతంగా ఉన్నది. అత్యధిక గిరిజన జనాభా ఉండే ఈశాన్య రాష్ట్రాలలో బహుభార్యత్వం ఎక్కువ అని ఈ సర్వేలో తేలింది. మామూలుగా కూడా మన నివసించే ప్రాంతాలలో గమనిస్తే 99శాతం ముస్లింలలో ఒకే పెళ్ళి, ఇద్దరు లేక ముగ్గురు పిల్లలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇది కాలంతో వచ్చిన మార్పు. గతంలో హిందు ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో కూడా పుట్టెడు పిల్లలు ఉండేవారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవ్వడం, విద్య, ఆర్థిక మార్పులతో నేడు ఒక్కరూ లేదా ఇద్దరు పిల్లలతో పరిమితమవుతున్నారు.

మెజార్టీ ఓట్ల కొరకు జరిగే కుట్ర

అన్ని మతాలకు వ్యక్తిగత చట్టాలు మన రాజ్యాంగంలో పొందుపర్చారు. హిందూ మతంలో కూడా అనేక జాతులు తెగలకు వ్యక్తిగత చట్టాలున్నాయి. సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, ఆదివాసీలు ఇలా అనేక జాతులు, తెగలకు వారి వారి వ్యక్తిగత చట్టాలున్నాయి. ఈ క్రమంలో యుసిసిని ముస్లింలు మాత్రమే వ్యతిరేకించడంలేదు. హిందూ మతంలోని విభిన్న కులాలు, తెగలు, వివిధ రకాల ఆచార వ్యవహారాలు కలిగినవారు, దేశంలోని అసంఖ్యాక ఎస్‌సి, ఎస్‌టి వర్గాలు కూడా ఏకత్వం పేరుతో జరుగుతున్న ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాయి. "ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా "యుసిసిని క్రిష్టియన్లకు, ఆదివాసీలకు వర్తింపజేయటం లేదని" తమకు హామీ ఇచ్చినట్లుగా నాగాలాండ్ ముఖ్యమంత్రితో కూడిన ప్రతినిధి బృందం ప్రకటించింది. అలాగే ఆదివాసీల ఆచార వ్యవహారాలు భిన్నమైనవైనందున వారిని యుసిసిపరిధిలోకి తీసుకురావద్దని బీజేపీ ఎంపీ సుశీల్ మోదీ నేతృత్వం లోని న్యాయశాఖ పార్లమెంటరీ కమిటీ సూచించింది. అందరికి ఒకేచట్టం అని ఒకవైపు చెబుతూ క్రిష్టియన్లకు, ఆదివాసీలకు వర్తింపచేయడం లేదంటే కేవలం ముస్లింలనే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొస్తున్నట్లుగా అర్థమవుతున్నది.

ప్రస్తుతం దేశంలో ఉన్న హిందూ వివాహ చట్టం కూడా ఏకరీతిలో లేదు. హిందూ వివాహచట్టం గోవాలోని హిందువులకు వర్తించదు. గోవాలో హిందూ పురుషుని భార్య 30 ఏళ్లలోపు, మగబిడ్డకు జన్మ ఇవ్వకపోతే పురుషుడు మరో వివాహం చేసుకోవచ్చును. ఉత్తరాదిన మేనరిక వివాహాలు నిషిద్ధం. దక్షిణాదిన మేనరిక వివాహాలకు ఆమోదం ఉన్నది. హిందు వివాహ చట్టం ప్రకారం సపిండ (రక్త సంబంధీకుల) వివాహాలు నిషిద్ధం. అదే సమయంలో ఆయా ప్రాంతాలలో ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా సడలింపులను కూడా ఈ చట్టం ఇచ్చింది. కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా బాల్య వివాహాల రద్దు చట్టం, సతీ సహగమనం ఆచార చట్టం, త్రిపుల్ తలాక్ లాంటి చట్టాలను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఒక్క ముస్లిం మతానికి సంబంధించిన వారే కాకుండా అన్ని మతాల్లోని వారు కూడా ఉమ్మడి పౌరస్మృతిని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

భారత దేశంలో మూడువేల కులాలు, 25వేల ఉప కులాలు, ఏడు వందల గిరిజన తెగలు, 1600 భాషలు, వేలాది మాండలికాలు, 3000లకు పైగా జాతులు ఉన్నవి. హిందూ, ఇస్లాం, క్రిష్టియానిటీ, సిక్కు, జొరోస్ట్రియన్, బౌద్ధం, జైనం, జూడా లాంటి అనేక మతాలు భారత దేశంలో ఉన్నాయి. అలాగే వేదకాలం నాటి నుండి బ్రిటీష్ కాలం వరకు భిన్నత్వంతో కూడిన వ్యక్తిగత చట్టాలు కొనసాగుతున్నవి. ప్రతి మతానికి, ఆ మతంలో అనేక తెగలకు, జాతులకు వేర్వేరు వివాహ సంస్కృతులు, ఆచారాలు, భిన్నమైన కుటుంబ పద్ధతులు కొనసాగుతున్నాయి. ఈ విధంగా వైవిధ్యంతో కూడిన భిన్నత్వంలో ఏకత్వం-ఏకత్వంలో భిన్నత్వంగా వెలుగొందుతున్న భారత్‌లో కేవలం ఏకత్వం పేరుతో ఒకే దేశం-ఒకే జాతి లాంటి ఆకర్షణీయమైన నినాదాల ముసుగులో ఉమ్మడి పౌరస్మృతి చట్టాన్ని బలవంతాన అమలు చేయడం బీజేపీకి మాత్రం లబ్ధి చేకూర్చుతుంది. దేశానికి అది ఆత్మహత్యా సాదృశ్యమే. కావున ఏకత్వానికి బదులు ఏకాభిప్రాయాన్ని సాధించాలి.

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

ప్రపంచంలో తొలి భౌతికవాదులు మన చార్వాకులు

డాక్టర్ దేవరాజు మహారాజు

జైన, బౌద్ధ ధర్మాల గురించిన సమాచారం మనకు చాలానే అందింది. కానీ, చార్వాకుల వివరాలూ, వారి సాహిత్యం ఎందుకు అందలేదూ? అంటే వైదిక ధర్మ ప్రభోదకులు పనిగట్టుకుని ఆ సాహిత్యాన్ని ఆనవాళ్లు లేకుండా నాశనం చేశారు. కాబట్టి! మరి, ఈ మాత్రం కొన్ని విషయాలైనా మనకు ఎలా అందాయి? అంటే, చార్వాక/ లోకాయతలను తీవ్రంగా ఖండించిన వైదికుల రచనల నుండి కొన్ని విషయాలు అందాయి. అంటే చార్వాక విరోధుల నుండి కొన్ని సంగతులు బైటకివచ్చాయి. చార్వాక విరోధులు ఏయేవిషయాలలో చార్వాకులతో విభేదించారో-వారు రాసినప్పుడు, చార్వాకులు ఆలోచనలు కొన్ని మనకు తెలిశాయి. హేతువాద దృక్పథంతో చూసినప్పుడు, చార్వాకులు వాస్తవాలు మాట్లాడుతున్నారనీ, ఈ విభేదించే వైదిక రచయితలు, ఆర్యసమాజికులు అడ్డదిడ్డంగా వాదిస్తున్నారనీ మనకు అనిపిస్తుంది. ఉదాహరణకు దయానంద సరస్వతి తన 'సత్యార్థప్రకాశ్'లో వేదాలను చార్వాకులు తిరస్కరించారని చెబుతూ "వేద విద్య లేకపోతే అవిద్య విస్తరిస్తుంది" అని అన్నాడు. ఒప్పుకుందామా? అలాగే తల్లిదండ్రుల కలయికతోనే సంతానం కలుగుతుందని చార్వాకులు చెప్పింది నిజమే కానీ, తొలి మానవుడు ఎలా పుట్టాడూ? అ విషయం చార్వాకులు ఎందుకు గ్రహించలేదు అని ప్రశ్నించాడు. ఇది చార్వాకుల విరోధుల నుండే చార్వాకుల ఆలోచనలు మనకు అందాయి.

చార్వాక ఆలోచనా విధానాన్ని గురువైన బృహస్పతి బహుళ ప్రచారంలోకి తెచ్చాడని దయానంద సరస్వతి తన సత్యార్థ ప్రకాశ్‌లో రాశాడు. సాధారణ శకానికి చాలా ముందు బృహస్పతి అనేక నియమాలు రాశాడు. వ్యవసాయం ఎలా చేయాలి? వ్యాపారం ఎలా చేయాలి? సరుకు మార్పిడి ఎలా జరగాలి? వంటి నాటి నిత్య జీవితానికి అవసరమైన పలు అంశాల గూర్చి రాశాడు. ఇవే కాకుండా పరిపాలకుడైన రాజుకు ఏయే లక్షణాలు ఉండాలో కూడా రాశాడు. ఆ కాలంలో పద్దెనిమిది గణ రాజ్యాలుండేవి. ప్రతి గణానికి ఒక ఈశుడు (రాజు-అధిపతి) ఉండేవాడు. గణానికి అధిపతే గణాధిపతి. గణానికి ఈశుడెవరో అతడే గణేశుడు. అంతేకాని, వైదిక ధర్మకర్తలు కల్పించిన ఏనుగు తొండంతో ఉండే గణపతి కాదు. అది తొండి గణపతి. ఆ కాలంలో ఉన్న గణపతికి అర్థాలు మార్చి పిట్టకథలు ప్రచారం చేశారు కాబట్టి, అది తొండి అనే కదా అనుకోవాలి? గణానికి ఈశుడైన వాడికి ఏ లక్షణాలు ఉండాలో బృహస్పతి ఇలా రాశాడు "భూమిని తల్లిగా భావించేవాడు-ప్రజల సుఖాలు చూసేవాడు-రక్షించగల బలశాలి-సమస్యల్ని పరిష్కరించే బుద్ధిశాలి-స్త్రీలపై చూపుపడనివాడు" ఈ విషయాలన్నీ 5వేల సంవత్సరాల క్రితం చెప్పినవి. ఆ తర్వాత చాలా కాలానికి చాణుక్యుడు ఈ అంశాలన్నింటినీ చేర్చి అర్థశాస్త్రం ప్రకటించాడు. చార్వాకుల గురువైన బృహస్పతి పేరును తొక్కిపెట్టి, బ్రాహ్మణార్యుడైన చాణుక్యుడికి, అతని అర్థశాస్త్రానికీ ప్రాచుర్యం కల్పించుకున్నారు.

చార్వాక సాహిత్యం విరివిగా లభించలేదు కాని, ప్రపంచానికి భౌతిక వాదం గురించి చెప్పిన తొలి తార్కికవాదులు వారే. వారిని మనం భౌతికవాదులు, దేహవాదులు, తర్కవాదులు, నాస్తికులు వంటి పేర్లతో పిలుచుకోవచ్చు. మన దేశ సంపదను మనమే నాశనం చేసుకుని, కొన్నివేల ఏళ్లనుండి మనువాదుల ప్రభావంలోపడి, భ్రమల్ని నమ్ముతూ, మూఢనమ్మకాల్ని నమ్ముతూ, దుష్ట సంప్రదాయాలను ఆచరిస్తూ జీవితం దుర్భరం చేసుకుంటున్నాం. ఇదే పరిస్థితి యూరప్ దేశాలలో కూడా వచ్చింది. అక్కడి మత న్యాయస్థానాలు హేతువాదుల్ని, తర్కవాదుల్ని తాత్వికుల్ని, శాస్త్రజ్ఞుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేశారు. మత ఛాందసులు అఘాయిత్యాలు చెప్పనలవికానంతంగా అక్కడ జరిగాయి. నిజమే! కానీ అక్కడివారు తమ ఆలోచనా ధోరణి మార్చుకుని భౌతికవాదులకు, శాస్త్రజ్ఞులకు అడ్డుపడడం తగ్గించారు. ఫలితంగా ఆ దేశాలు వైజ్ఞానిక ప్రగతిని సాధించాయి. మన దేశంలో హేతువాదుల్ని ఇప్పటికీ చంపుతూనే ఉన్నారు. అందుకే ఇక్కడ ప్రగతిలేదు. 17వ శతాబ్దం నుంచి యూరప్ దేశాలు సాధించిన వైజ్ఞానిక పరిశోధనా ఫలితాల్ని మన దేశం కూడా అనుభవిస్తూనే ఉంది. అయినా సిగ్గులేకుండా "అవన్నీ మా పూర్వీకులు ఎప్పుడో కనిపెట్టారని" కొందరు గొప్పలు చెప్పుకుంటున్నారు. అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. గుండె మీద చేయివేసుకుని, నిజాయితీగా ఆలోచిస్తే దేశంలో జరుగుతున్నదేమిటో అర్థమవుతుంది.

భౌతికవాదులు ఎప్పుడూ తాము చూడని, తమకు అనుభవంలోకిరాని విషయాన్ని నిర్ద్వందంగా తిరస్కరించారు. ఉదాహరణకు దేవుడు, దయ్యం, స్వర్గం, నరకం, కర్మ,ఆత్మ పునర్జన్మ వంటి వాటికి ఎప్పుడూ ఎక్కడా ఆధారాలు లేవు. ఇలా ఆధారాలు లేదని వాటిని లోకాయతులు, చార్వాకులు అసలు పరిగణనలోకి తీసుకోరు. చార్వాకులు స్పృహను స్పృహగా మాత్రమే గుర్తించారు. దాన్ని 'చైతన్య విశిష్ట దేహ నవ ఆత్మ" గా పరిగణించారు. పురుషార్థ కామమోక్ష-పురుషార్థాలు నాలుగు అని వైదిక ధర్మం చెపుతోంది. ధర్మ, అర్థ, కామ, మోక్షలలో అర్థ, కామ అనే రెంటిని మాత్రమే చార్వాకులు ఒప్పుకున్నారు. ధర్మ మోక్షాలను పూర్తిగా తిరస్కరంచారు. ఎందుకంటే ఆ రెండు పూజారులు, పురోహితులు, బ్రాహ్మణుల పొట్టకూటి కోసం జనాన్ని మోసం చేసి దోచుకోవడం కోసం కల్పించినవని తేల్చి చెప్పారు. కామ, అర్థాలను ఒప్పుకున్నారు. ఎందుకంటే మనిషికి కోరికలు (కామ) ఉంటాయి, అవి తీరాలంటే ధనం, సంపద (అర్థ) తప్పనిసరి. అందువల్ల వాటిని స్వీకరించారు. ధర్మానికి అధారం ధనమేనన్నారు. మోక్షం సాధించాలంటే ధర్మ ప్రవర్తన అవసరమనీ బ్రాహ్మణార్యులు తమ జీవనానికి ఉపయోగపడే నీతి సూత్రాలు ప్రచారం చేశారు కాబట్టి, చార్వాకులు వాటిని తిరస్కరించారు. అలాగే సంశయాత్మకంగా ఉండే వాటిని కూడా ఒప్పుకోలేదు.

జ్ఞానమంతా దాదాపు అనుభవం నుంచి వచ్చిందే గనుక, లోకాయతులు దాన్ని తప్పక స్వీకరించారు. మనిషైనవాడు తన పురోగతిని తను చూసుకోవాలి. తన ఆరోగ్యం తను కాపాడుకోవాలి. తను సంతోషంగా ఉన్నప్పుడే అతను ఇతరుల గురించి ఆలోచించగలడు. వారికి తగిన సహాయం చేయగలడు. కష్టాల్లో కుమిలిపోయే వాడు ఇతరులు గూర్చి ఆలోచించలేదు. ఇతరులకు ఏ సహాయమూ చేయలేడు. వ్యక్తిగతంగా ఎవరికి వారు వృద్ధిలోకి వస్తే సమాజం కూడా అభివృద్ధి అవుతుంది. జీవితంలో వెలుగు చీకట్ల వలె సంతోషంతోపాటు దు:ఖం కూడా ఉంటుంది. భరించాల్సిందే-దాన్ని అధిగమించాల్సిందే।అన్నది చార్వాకుల సిద్ధాంతం.

వైద్య విద్యార్థులు ఇన్ని వందల సంవత్సరాలుగా మానవులు మృతదేహాల్ని కోసి అవయవ నిర్మాణం గురించి అధ్యయనం చేస్తున్నారు కదా? మరి ఎవరికీ ఎప్పుడూ ఆత్మ కనబడ లేదు ఎందుకు? పోనీ జీవించి ఉన్నవారికి ఆపరేషన్లు చేస్తున్నారు కదా? ఒక్కోసారి ఆపరేషన్ విఫలమై అక్కడే ఆ బల్లమీదే కొందరు ప్రాణాలు విడుస్తున్నారు. పోనీ అప్పుడైనా డాక్టర్లకు ఆత్మ కనబడాలి కదా? కనబడడం లేదు. ఎందుకుంటే అలాంటిది ఏదీ లేదు కాబట్టి! ఇంత ప్రగతి సాధించిన తర్వాత కూడా కనిపెట్టలేని ఆత్మ ఇక లేనట్టే కదా? ఇదే విషయం సాధారణ శకానికి ముందు చార్వాకులు కేవలం తమ పరిశీలనతో, వివేకంతో ఆత్మలేదని చెప్పారు. మరి వారు తెలివిగల వాళ్ళా? తెలివిలేని వాళ్లా ఆలోచించుకోవలసింది మనమే! మనుషులకు ఆత్మ ఉంటుందని అంటున్నారు కదా? "మరి కుక్క, గాడిద వంటి జంతువులకు కూడా ఆత్మ ఉంటుందా? అవికూడా జీవం ఉన్న ప్రాణులే కదా?" అని చార్వాకులు బ్రాహ్మణార్యుల్ని ఆనాడే ప్రశ్నించారు. సమాధానం చెప్పి ఒప్పించే తెలివిలేని ఆ మనువాదులు చార్వాకుల్ని దుష్టులని, ధూర్తులని ఈసడించుకున్నారు. అంతేకాదు, వారి ఆలోచనలు ముందు తరాలకు అందకుండా జాగ్రత్తపడ్డారు. తర్కవాదులు బలపడితే ధర్మ గురువుల దుకాణాలన్నీ మూతపడతాయి. వారి ఉనికికే ప్రమాదం అని గ్రహించి, చార్వాకుల్ని అన్ని రకాలుగా నాశనం చేశారు. అందువల్లనే చార్వాక సాహిత్యం మనదాకా రాలేదు. దాని స్థానంలో బ్రాహ్మణార్యులు తమ సాహిత్యం కుప్పలు తెప్పలుగా గుమ్మరించారు. జనాన్ని భ్రమల్లో, విశ్వాసాల్లో కట్టుకథల్లో ముంచి జ్ఞానహీనులుగా తయారుచేశారు. అందుకే చూడండి, దేశంలో ఇప్పటికీ జ్ఞానహీనుల సంఖ్యే ఎక్కువ. అజ్ఞానుల్ని, అమాయకుల్ని క్షమించవచ్చు. చదువు, స్థాయి, హెూదా ఉండి కూడా జ్ఞాన హీనులుగా ప్రవర్తించేవారిని ఏమందాం? ఎలా మార్చుకుందాం?

-కేంద్ర సాహిత్య అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

రాహుల్‌కు మటన్‌తో లాలు విందు

న్యూదిల్లీ: పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టు ఊరట కల్పించిన తర్వాత ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్...రాహుల్‌తో తన సంతోషాన్ని పంచుకున్నారు. విందు కోసం దిల్లీలోని తన కుమార్తె మీసాభారతి ఇంటికి రాహుల్‌ను ఆహ్వానించారు. రాహుల్‌కు లాలూ పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. రాహుల్ కోసం బీహార్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన మటన్‌ను లాలూ స్వయంగా వండి వడ్డించారు. ఈ విందు కార్యక్రమంలో మీసాభారతితో పాటు బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పాల్గొన్నారు. 26 పార్టీల ఇండియా కూటమిలో కాంగ్రెస్‌-ఆర్జేడీలు భాగస్వాములు కావడం, విపక్ష పార్టీలన్నీ ముంబైలో ఈ నెలాఖరున సమావేశం కానున్నందున లాలూ-రాహుల్ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. విందు సమావేశంలో రాజకీయాల గురించి పెద్దగా చర్చకు రాలేదని, విందును ఆస్వాదిస్తూ చిన్నపాటి సంభాషణ వారి మధ్య జరిగినట్లు తెలుస్తోంది. లాలూ ఆరోగ్య పరిస్థితిని రాహుల్ అడిగి తెలుసుకున్నారు.

రాజకీయాల కోసం కోర్టులను వాడుకోవడం సరికాదు: సిబల్



న్యూదిల్లీ: పరువు నష్టం కేసులో తాను ముందుగా చెప్పినట్లు రాహుల్ గాంధీకి విధించిన శిక్ష అసమంజసమైనదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కపిల్ సిబల్ అన్నారు. రాజకీయ అజెండాల కోసం కోర్టు విధానాలను ఉపయోగించుకోవటం దురదృష్టకరమని తెలిపారు. రాహుల్‌కు విధించిన శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించడంతో రాజ్యసభ ఎంపీ సిబల్ శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. తన మోదీ ఇంటిపేరు వ్యాఖ్యపై 2019 క్రిమినల్ పరువునష్టం కేసులో శిక్షను నిలిపివేసి, లోక్‌సభ ఎంపీగా తిరిగి నియమించడానికి మార్గం సుగమం చేసిన తర్వాత రాహుల్ గాంధీ శుక్రవారం సుప్రీం కోర్టు నుంచి భారీ ఉపశమనం పొందారు. లోక్‌సభ నుంచి అనర్హతకు దారితీసిన రాహుల్‌పై నేరారోపణపై ఆయన గరిష్ఠంగా రెండేళ్ల శిక్ష ఎందుకు అర్హుడో వివరించడంలో గుజరాత్‌లోని సూరత్‌లోని ట్రయల్ కోర్టు విఫలమవడంతో 53 ఏళ్ల గాంధీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించేలా స్టే విధిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది. శిక్ష ఒక రోజు తక్కువగా ఉంటే అనర్హత వేటు పడదని కూడా పేర్కొంది. రాహుల్ నేరారోపణపై సుప్రీం కోర్టు స్టే విధించిందని సిబల్ ట్వీట్ చేశారు. రాహుల్‌ను దోషిగా తేల్చిన కోర్టు నేను బహిరంగంగా ఆ శిక్ష అసంబద్ధమని, నిలబడదని చెప్పాను. నేను చెప్పిన కారణం నిన్న సుప్రీం కోర్టు చెప్పింది. 'రాజకీయ ఎజెండాల కోసం కోర్టు విధానాలను ఉపయోగించడం దురదృష్టకరం' అని పేర్కొన్నారు.

గుజరాత్‌లో బీజేపీకి షాక్

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గుజరాత్ బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ కీలక నేత బీజేపీకి షాక్ ఇచ్చారు. బీజేపీ గుజరాత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి ప్రదీప్‌సిన్హ్ వాఘేలా శనివారం రాజీనామా చేశారు. అయితే, కొద్ది రోజుల క్రితమే తన పదవికి రాజీనామా చేసినట్లు ఆయన చెప్పారు. అయితే రాజీనామాకు స్పష్టమైన కారణమేదీ ఆయన వెల్లడించలేదు. మరికొన్ని రోజుల్లో అంతా చక్కబడుతుందని చెప్పారు. 2016 ఆగస్టులో వాఘేలాను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బీజేపీ నియమించింది. భారతీయ జనతా యువ మోర్చా అధ్యక్షుడిగా ఆయన గతంలో పనిచేశారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గుజరాత్ బీజేపీ ఇటీవల ప్రజలను నేరుగా కలుసుకునేందుకు 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని చేపట్టింది. మేధావులు, వాణిజ్య వర్గాలతో సదస్సులు నిర్వహించింది. 26 లోక్‌సభ నియోజకవర్గాల్లో భారీ ర్యాలీలు జరిపింది.

అన్నాడీఎంకే ఎంపీ రవీంద్రనాథ్‌కు ఊరట

న్యూదిల్లీ: తమిళనాడులోని తేని పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి బహిష్కరణకు గురైన ఏఐఏడీఎంకే సభ్యుడు పి.రవీంద్రనాథ్ 2019 ఎన్నిక 'చెల్లదు' అని ప్రకటించిన మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. హైకోర్టు ఆదేశానికి వ్యతిరేకంగా రవీంద్రనాథ్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించి, తేని నియోజకవర్గం నుంచి రవీంద్రనాథ్ ఎన్నికను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన పి.మిలానికి నోటీసులు జారీ చేసింది. 'ఇంతలోగా, మద్రాస్‌లోని హైకోర్టు ఆఫ్ జ్యుడికేచర్ ఆమోదించిన జులై 6, 2023 నాటి ఇంప్యూగ్న్ జడ్జిమెంట్, ఆర్డర్ ఆపరేషన్ నిలిపివేయబడుతుంది. ఫలితంగా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు 17వ లోక్‌సభ అన్ని ఉద్దేశాలు, ప్రయోజనాల కోసం అప్పీలుదారు (పి.రవీంద్రనాథ్) పార్లమెంటు సభ్యునిగా కొనసాగడానికి అనుమతించబడతారు' అని ధర్మాసనం శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. రవీంద్రనాథ్ పదవీచ్యుతుడైన అన్నాడీఎంకే నేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్ సెల్వం కుమారుడు. ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసే సమయంలో రవీంద్రనాథ్ తన చర, స్థిర ఆస్తులు, అప్పులు, కుటుంబ సభ్యుల వివరాలతో సహ అనేక అంశాలను దాచిపెట్టారని మిలాని హైకోర్టులో ఆరోపించారు. వాస్తవాలను అణచివేయడం వల్ల ఎన్నికలపై ప్రభావం చూపిందని ఆయన తన ఎన్నికల పిటిషన్‌లో ఫిర్యాదు చేశారు.

హిందీని అంగీకరించం: స్టాలిన్

చెన్నై: హిందీ భాష వివాదం మళ్లీ మొదలైంది. ఎలాంటి వ్యతిరేకత లేకుండా హిందీని స్వీకరించవలసిందేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పడాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఆక్షేపించారు. హిందీ పట్ల గల వ్యతిరేకతను గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1965నాటి హిందీ వ్యతిరేక ఆందోళనలను మళ్లీ రెచ్చగొట్టవద్దని హెచ్చరించారు. హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో ఆ భాషను రుద్దేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని స్టాలిన్ దుయ్యబట్టారు. హిందీతో తాము బానిసలం కాబోమని స్పష్టంచేశారు. అధికార భాషపై పార్లమెంటరీ కమిటీ సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ ఎలాంటి వ్యతిరేకత లేకుండా అంతిమంగా హిందీని స్వీకరించవలసిందేనని చెప్పారు. ఈ అమోదం నెమ్మదిగా జరిగినప్పటికీ ఎప్పటికైనా హిందీని అంగీకరించక తప్పదన్నారు. దీనిపై స్టాలిన్ ఓ ప్రకటనలో స్పందిస్తూ హిందీకి అమోదం లభించడం కోసం అమిత్ షా దుస్సాహసానికి ఒడిగడుతున్నారని విమర్శించారు. హిందీ మాట్లాడనివారిని తమ ఆధిపత్యం కిందకు వచ్చేలా చేయడానికి జరుగుతున్న దారుణమైన ప్రయత్నమని ఆరోపించారు. హిందీ ఆధిపత్యాన్ని, దానిని రుద్దడాన్ని తమిళనాడు తిరస్కరిస్తుందని స్పష్టం చేశారు. మన భాష, వారసత్వం మనల్ని నిర్వచిస్తున్నాయి. కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో హిందీ పట్ల ఎలాంటి వ్యతిరేకత వ్యక్తమవుతోందో గుర్తించాలని అమిత్ షాను కోరారు.

24 మెడికల్ షాపుల కూల్చివేత

నుహ్‌లో కొనసాగుతున్న 'బుల్డోజర్' చర్యలు

న్యూదిల్లీ: చట్టవిరుద్ధ నిర్మాణానికి వ్యతిరేకంగా హరియాణాలోని నుహ్ జిల్లా పాలనా యంత్రాంగం మూడవ రోజు కూడా 'బుల్డోజర్' చర్యలను కొనసాగించింది. ఈ సందర్భంగా శనివారం ఉదయం దాదాపు రెండు డజన్ల మెడికల్ స్టోర్లు, ఇతర దుకాణాలు నేలమట్టమయ్యాయి. గురువారం సాయంత్రం ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నందుకు హింసాత్మకమైన నుహ్‌కు 20 కిలోమీటర్ల దూరంలోని తౌరులో నివసిస్తున్న వలసదారుల గుడిసెలను వారు ధ్వంసం చేశారు. అదే క్రమంలో నల్హర్‌లోని షాహీద్ హసన్ ఖాన్ మేవాటి ప్రభుత్వ వైద్య కళాశాల, నుహ్‌లోని నల్హర్‌లో బుల్డోజర్లు చుట్టుముట్టాయి. ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న దాదాపు రెండు డజన్ల దుకాణాలను, ఎక్కువగా ఫార్మసీలను కూల్చివేసింది భారీ పోలీసు మోహరింపు నడుస్తోంది. ఈ దుకాణాలు ఏళ్ల తరబడి ఉన్నాయి. బుల్డోజర్ చర్య రోజంతా వివిధ ప్రదేశాలలో కొనసాగింది. జిల్లా పరిపాలన బృందాలు అక్కడికక్కడే ఉన్నాయి. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 50 నుంచి 60 వరకు నిర్మాణాలను కూల్చివేశారు. అరెస్టులకు భయపడి చాలా మంది పారిపోయారు. విశ్వహిందూ పరిషత్ ఊరేగింపును అడ్డుకునే ప్రయత్నంలో జరిగిన ఘర్షణల నేపథ్యంలో నుహ్ అంతటా భద్రతను పటిష్టం చేశారు. గత కొన్ని రోజులుగా గురుగ్రామ్‌లో హింస చెలరేగింది. ఇద్దరు హోంగార్డులు, ఒక మతాధికారి సహా ఆరుగురు మరణించారు. గత కొన్నేళ్లుగా తొలగించలేని అక్రమ ఆక్రమణలన్నింటినీ జిల్లా యంత్రాంగం తొలగించడం ప్రారంభించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ చర్యపై స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఉప నేత అఫ్తాబ్ అహ్మద్ నిరసన వ్యక్తం చేశారు. 'నుహ్‌లో పేదల ఇళ్లు కూల్చివేయడమే కాకుండా సామాన్యుల విశ్వాసం కూడా ధ్వంసమవుతోంది. ఒక నెల వెనుకటి తేదీలతో నోటీసులిచ్చి ఈరోజు ఇళ్లు, దుకాణాలు కూల్చివేశారని గ్రామస్తులు తెలిపారు. పరిపాలనా వైఫల్యాలను దాచడానికి ప్రభుత్వం తప్పుడు చర్య తీసుకుంటోంది. ఇది అణచివేత విధానం' అని కూల్చివేత వీడియోతో పాటు ట్వీట్ చేశారు. మత ఘర్షణలకు సంబంధించి ఇప్పటివరకు 202 మందిని అరెస్టు చేశామని, 80 మందిని ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నామని హరియాణా హోం మంత్రి అనిల్ విజ్ శుక్రవారం తెలిపారు. గుట్టల నుంచి బుల్లెట్లు కాల్చడం, భవనాల పైకప్పులపై సేకరించిన రాళ్లు నుహ్ హింస ముందస్తు ప్రణాళిక అని సూచిస్తున్నాయని కూడా ఆయన అన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు ఇప్పటి వరకు 102 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే, శుక్రవారం విలేకరుల సమావేశంలో నుహ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నరేంద్ర సింగ్ బిజార్నియా మాట్లాడుతూ ఘర్షణల వెనుక సూత్రధారి ఉన్నట్లు తమకు ఇప్పటివరకు ఎటువంటి సూచనలను గుర్తించలేదని, ఇప్పటి వరకు జరిగిన విచారణలో భిన్నాభిప్రాయాల ప్రమేయం ఉందని సూచించిందని, వాటిని గుర్తించి అరెస్టు చేస్తున్నామని తెలిపారు.

మరో ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య

న్యూదిల్లీ: దేశీయ విమానయాన సంస్థ ఇండిగోకు చెందిన విమానాల్లో వరుసగా సాంకేతిక సమస్యలు చోటుచేసుకుంటు న్నాయి. నిన్న ఇంజిన్ వైఫల్యం కారణంగా ఓ ఇండిగో విమానం పాట్నాలో అత్యవసరంగా దిగగా... తాజాగా మరో విమానాన్ని దిల్లీ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. శనివారం ఉదయం 7.40 గంటల ప్రాంతంలో దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఓ ఇండిగో విమానం ఝార్ఖండ్ రాజధాని రాంచీకి బయల్దేరింది. అయితే టేకాఫ్ అయిన కాసేపటికే విమానంలో సాంకేతిక సమస్య ఎదురైంది. దీంతో గంటలోపే విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఉదయం 8.20 గంటలకు ఈ విమానం తిరిగి దిల్లీ విమానాశ్రయంలో దిగింది. విమానంలో సాంకేతిక సమస్య ఎదురైందని, అందుకే దిల్లీ విమానాశ్రయానికి మళ్లిస్తున్నామని పైలట్ ప్రకటించారు. విమానం సురక్షితంగా ల్యాండ్ అవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. దీనిపై ఇండిగో స్పందించింది. ప్రయాణికులను మరో విమానంలో రాంచీకి పంపిస్తామని తెలిపింది.

జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో ఏఎస్ఐ సర్వే

హాజరైన ముస్లిం పెద్దలు

వారణాసి: ఉత్తర ప్రదేశ్‌లోని జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) శాస్త్రీయ సర్వే రెండో రోజు శనివారం ఉదయం పునఃప్రారంభమైంది. ఈ సర్వేకు ముస్లిం పక్షం కూడా హాజరైంది. ఏఎస్ఐ అధికారులు ఐదు బృందాలుగా విడిపోయి సర్వే చేస్తున్నారు. 17వ శతాబ్దంనాటి ఈ మసీదును అంతకుముందే నిర్మితమైన హిందూ దేవాలయంపై నిర్మించారా అనే అంశం ఈ సర్వేతో తేటతెల్లమవుతుంది. ఈ మసీదులో శాస్త్రీయ సర్వేను అడ్డుకునేందుకు ముస్లిం పక్షం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సుప్రీంకోర్టు కూడా సైంటిఫిక్ సర్వే చేయడానికి అనుమతించడంతో ముస్లిం పక్షం రెండో రోజు సర్వేలో పాల్గొంటోంది. జమాత్ కమిటీ సంయుక్త కార్యదర్శి సయ్యద్ మహమ్మద్ యాసిన్ మాట్లాడుతూ సర్వే తొలి రోజు తాము హాజరు కాకపోవడానికి ఈ అంశంపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతుండటమే కారణమని చెప్పారు. ఏఎస్ఐ అధికారులు అత్యాధునిక రాడార్ టెక్నాలజీతో సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఏడు గంటలపాటు జరిగిన సర్వేలో ఈ మసీదు సముదాయంలోని బయటి, లోపలి భాగాలను వీడియో, ఫోటో చిత్రీకరణ జరిగింది. లేఅవుట్, భవన నిర్మాణ చిత్రాలను సిద్ధం చేయడానికి ఎక్కువ సమయం పట్టింది. ఏఎస్ఐ అధికారులతో కలిపి 37 మంది, నలుగురు ఐఐటీ నిపుణుల బృందం తొలి రోజు సర్వేలో పాల్గొన్నారు. వీరు నాలుగు బృందాలుగా విడిపోయి సర్వే చేశారు. రెండో రోజు శనివారం జరుగుతున్న సర్వేకు ముస్లిం పక్షం నుంచి ఐదుగురు ప్రతినిధులు, రెండు పక్షాల న్యాయవాదులు పాల్గొన్నారు.

అదానీ గ్రూపుతో పోటీ పడితే ఐటీ, ఈడీ దాడులే

మోదీ ప్రభుత్వ తీరుపై జైరాం రమేశ్ విమర్శలు

న్యూదిల్లీ: ప్రతిపక్షాలపైనే కాకుండా అదానీ గ్రూప్‌తో పోటీ పడే వ్యాపార సంస్థలపైనా ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను బీజేపీ ప్రభుత్వం ప్రయోగిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఇందుకు ఉదాహరణగా తాజాగా సిమెంట్ కంపెనీని అదానీ గ్రూప్ కొనుగోలు చేయడాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రస్తావించారు. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, సిమెంటు కంపెనీలు ఇలా ఏ వ్యాపారంలోనైనా అదానీతో పోటీ పడితే సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేస్తున్నాయన్నారు. మోదీ ప్రభుత్వం ఈ సంస్థలను ప్రయోగించడం ద్వారా ప్రతిపాదిత ప్రయోజనం పొందే ఎలా లాభపడిందో అని హమ్ అదానీ కె హై కౌన్ (హెచ్ఏహెచ్‌కె)లో భాగంగా వ్యంగ్యంగా అన్నారు. 'సంఘి సిమెంట్స్‌ను కొనుగోలు చేసేందుకు దేశంలో అతిపెద్ద సిమెంట్ కంపెనీలో ఒకటైన శ్రీ సిమెంట్ 2023 ఏప్రిల్ 28న సిద్ధమైంది. జూన్ 21న ఐటీ శాఖ ఈ సంస్థకు చెందిన ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. జులై 19న సంఘి కొనుగోలు రేసు నుంచి శ్రీ సిమెంట్ తప్పుకుంది. ఆగస్టు 3న అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్... సంఘి ఇండస్ట్రీస్‌లో వాటాలు కొనుగోలు చేసింది' అని జైరాం రమేశ్ అన్నారు. గుజరాత్‌లోని సంఘిపురంలో ఉన్న సంఘి సిమెంట్ అతిపెద్ద సిమెంట్ ప్లాంట్ అని ఆయన చెప్పారు. సంఘీపురం పోర్టు సైతం అదానీ పోర్ట్స్ గుత్తాధిపత్యానికి దోహదం చేయనుందన్నారు. విపక్ష పార్టీల నేతలు, ప్రభుత్వాలు కూలదోయడానికి, అదానీతో వ్యాపారంలో పోటీ పడేవారిని నిలువరించేందుకూ దర్యాప్తు సంస్థలను మోదీ ప్రభుత్వం విచ్చలవిడిగా వాడేస్తోందని ఆరోపించారు. ముంబై విమానాశ్రయం, కృష్ణపట్నం పోర్టు, సంఘి ఇండస్ట్రీస్ అందుకు ఉదాహరణలు అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

ఆర్టికల్ 370 రద్దుకు నాలుగేళ్లు

కీలకనేతల గృహనిర్బంధం

శ్రీనగర్: జమ్ము-కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తోన్న ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగేళ్లు పూర్తయింది. తర్వాత జమ్ము-కశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలు (జమ్ము-కశ్మీర్, లద్దాఖ్)గా ప్రకటించింది. 2019 ఆగస్టు 5న ఈ నిర్ణయాన్ని అమలు చేసింది. ఈ నేపథ్యంలో జమ్ము- కశ్మీర్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకొంది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. అంతేకాకుండా అనేకమంది నాయకులను గృహనిర్బంధం చేశారని మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని కేంద్రం చేస్తున్న తప్పుడు వాదనలు మరోసారి నిరూపితమయ్యాయని విమర్శించారు. ఆర్టికల్ 370పై విచారణ చేపడుతోన్న వేళ... సుప్రీంకోర్టు ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ఆశిస్తున్నట్లు చెప్పారు. తమ ప్రధాన కార్యాలయానికి తాళం వేశారని, ఎవరినీ అనుమతించడం లేదని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ తెలిపింది. ఆర్టికల్ 370 రద్దుకు 4 ఏళ్ల పూర్తయినందున స్థానికంగా భారీ బందోబస్తు చేపట్టారు. శనివారం జమ్ము బేస్ క్యాంప్ నుంచి అమర్‌నాథ్ యాత్రను నిలిపివేశారు. ఇక్కడి నుంచి ఎవరినీ యాత్రకు అనుమతించలేదు. దీంతో వందలాది యాత్రికులు క్యాంపులకే పరిమితమయ్యారు. మరోవైపు...ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానంలో వాదనలు ప్రారంభమయ్యాయి. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. ఒడిశా పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం ఇదే రోజు 'ఆర్టికల్ 370'ను రద్దు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని, ఈ సందర్భంగా దేశ ప్రజల తరఫున ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

అల్లరిమూకలను టైట్లర్ రెచ్చగొట్టారు

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో సీబీఐ చార్జిషీట్

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించి పుల్ బంగష్ హత్యల కేసులో కాంగ్రెస్ నేత జగదీశ్ టైట్లర్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సంచలన ఆరోపణలు చేసింది. పుల్‌బంగష్ గురుద్వారా సిక్కులను హత్య చేసేలా అల్లరిమూకలను ఆయన రెచ్చగొట్టారని సీబీఐ తమ చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు టైట్లర్‌పై హత్య అభియోగాలు నమోదు చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ నేతపై సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లోని వివరాలు వెలుగులోకి వచ్చాయి. 1984 నవంబరు 1న టైట్లర్ తన కారు నుంచి దిగి అల్లరిమూకలను రెచ్చగొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారిని చంపేసి తర్వాత వారి దుకాణాలు లూటీ చేయాలని ఆయన ప్రేరేపించినట్లు సాక్షులు పేర్కొన్నారు. ఫలితంగా అల్లరిమూకలు పుల్ బంగష్ గురుద్వారాకు నిప్పంటించారు. ఆ తర్వాత ముగ్గురు సిక్కులను చంపేశారని సీబీఐ పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో జగదీశ్ టైట్లర్‌కు దిల్లీ కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. రూ.లక్ష విలువైన వ్యక్తిగత పూచీకత్తు, అంతే విలువ గల హామీతో ఈ బెయిల్ మంజూరు చేశారు. సాక్ష్యాధారాలు ప్రభావితం చేయకూడదని, అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని టైట్లర్‌కు కొన్ని ఆంక్షలు విధించారు. దీంతో భారీ భద్రత నడుమ టైట్లర్ శనివారం కోర్టుకు హాజరయ్యారు. బెయిల్ పూచీకత్తును సమర్పించారు. టైట్లర్ సతీమణి జెన్నిఫర్ ఆయనకు పూచీకత్తు ఇచ్చారు. ఈ పూచీకత్తు, హామీని అంగీకరించిన న్యాయస్థానం...ఛార్జిషీట్ కాపీని టైట్లర్‌కు ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 11వ తేదీకి వాయిదా వేసింది.

త్రిపురలో హిజాబ్ వివాదం

విద్యార్థినికి అండగా ముస్లిం బాలుడు: వీహెచ్‌పీ దాడి

అగర్తల: గతేడాది కర్నాటకలో జరిగిన హిజాబ్ వివాదం మరువకముందే... మరోసారి దేశంలో ఇలాంటి వివాదాలే రాజుకుంటున్నాయి. తాజాగా త్రిపురలో హిజాబ్ వివాదం తలెత్తింది. ఓ ముస్లిం విద్యార్థిని హిజాబ్ ధరించి పాఠశాలకు వచ్చినందుకు వీహెచ్‌పీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఘర్షణకు పాల్పడ్డారు. ఆ బాలికకు ఓ ముస్లిం బాలుడు అండగా నిలిచినందుకు విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు చితకబాదారు. ఈ ఘటన శుక్రవారం త్రిపుర రాష్ట్రంలోని సెపాహిజాలా జిల్లాలో కరైముదా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...కరైముదా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పైయతోష్ నంది విద్యార్థినులకు హిజాబ్ ధరించి పాఠశాలకు రావద్దని గతవారం సూచించారు. అయినప్పటికీ 12వ తరగతి చదివే ఓ ముస్లిం విద్యార్థిని హిజాబ్ ధరించి స్కూలుకు వచ్చేందుకు ప్రయత్నించింది. దీంతో ఆ పాఠశాల గేటు బయటే ఆ విద్యార్థినిని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు నిలువరించారు. ఆ బాలికకు పదో తరగతి చదివే ఓ ముస్లిం బాలుడు అండగా నిలబడ్డాడు. దీంతో వీహెచ్‌పీ కార్యకర్తలు ఆగ్రహం చెంది ఆ ముస్లిం బాలుడిని దారుణంగా రోడ్డుపై ఈడ్చుకెళ్లి చితకబాదారు. ఈ ఘటన జరుగుతుంటే... ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సహా ఏ ఉపాధ్యాయుడు ఆ బాలుడిని రక్షించేందుకు ప్రయత్నించలేదు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల సమీపంలోని రోడ్డును దిగ్బంధించారు. సెపాహిజాలా జిల్లాలోని బిషల్‌ఘర్ సబ్ డివిజన్‌లో ఉద్రిక్తపరిస్థితులు నెలకొనడంతో భారీగా పోలీసులు మోహరించారు. వీహెచ్‌పీ కార్యకర్తల్ని, స్థానికుల్ని చెదరగొట్టి పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటన జరగకముందే వారం రోజుల క్రితం వీహెచ్‌పీ కార్యకర్తలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కలిసి హిజాబ్‌ని నిషేధించాలని కోరారు. దీంతో ఆయన హిజాబ్ ధరించి స్కూల్‌కి రావద్దని విద్యార్థినిలకు సూచించినట్లు పాఠశాల అధికారులు తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. హిందూ ముస్లింలు కలిసి ఉన్న ప్రాంతమైనందున ఘర్షణలు జరగకుండా ముందస్తుగా పోలీసు బలగాలు అక్కడ భారీగా మోహరించారు.

రూ.1.39లక్షల కోట్లతో 6.4లక్షల గ్రామాలకు బ్రాడ్‌బాండ్

కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూదిల్లీ: భారత్ నెట్ ప్రాజెక్టు కింద 6.4లక్షల గ్రామాలకు బ్రాడ్‌బాండ్ సేవలు అందించేందుకు రూ.1.39లక్షల కోట్లను కేంద్రకేబినెట్ కేటాయించింది. శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగింది. 1.94లక్షల గ్రామాలు ప్రస్తుతం భారత నెట్ ప్రాజెక్టు పరిధిలో ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో మరో రెండున్నరేళ్లలో బ్రాడ్‌బాండ్ కనెక్టివిటీ ఉంటుంది. దేశంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ ఇచ్చేందుకు రూ.1,39,579 కోట్లను కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు అధికార వర్గాలు శనివారం తెలిపాయి. ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయంతో ఇంటింటికి ఫైబర్ నమూనాను స్థానిక ఎంట్రప్రెన్యూర్‌ల సాయంతో ఖరారు చేసినట్లు పేర్కొన్నాయి. తొలుత నాలుగు జిల్లాల్లోని గ్రామాలను బ్రాడ్‌బాండ్‌తో అనుసంధానం చేయగా, ఆపై 60వేల గ్రామాలకు సేవలను విస్తరించారు, ఈ ప్రాజెక్టుతో 3,800 మంది ఎంట్రప్రెన్యూర్‌లు ముడిపడి ఉన్నారు. మొత్తం 3.51లక్షల బ్రాడ్‌బాండ్ కనెక్షన్లు ఇచ్చారని వర్గాలు తెలిపాయి. ప్రతి ఇంటి నెలసరి డేటా వినియోగం సగటున 175జీబీలుగా ఉన్నట్లు పేర్కొన్నాయి. భారత్ బ్రాడ్‌బాండ్ నెట్వర్క్ లిమిటెడ్ (బీబీఎన్ఎల్), గ్రామీణ స్థాయి ఎంట్రప్రెన్యూర్ (వీఎల్ఈ) సమ భాగస్వామ్యంలో ప్రాజెక్టు ఉంది. దేశంలో ఇప్పటివరకు 37లక్షల రూట్ కిలోమీటర్ల (ఆర్‌కేఎం) ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సి) వేయగా ఇందులో 7.7లక్షల ఆర్‌కేఎంను బీబీఎన్ఎల్ వేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా 2.5లక్షల ఉద్యోగాలు సృష్టించనున్నట్లు అంచనా ఉంది.

ఎస్వీయూకు ముప్పు

- రాయలసీమ తలమానికానికి తలవంపులు
- విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మాస్టర్ రోడ్ల నిర్మాణానికి ముమ్మర యత్నం
- ప్రశాంత వాతావరణానికి గండి కొడుతున్న ప్రభుత్వం
- వర్సిటీ పవిత్రతకు ముప్పని ఘోషిస్తున్న ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు
- ఆగని పాలక పక్షం ప్రయత్నాలు

విశాలాంధ్ర-తిరుపతి: విద్యా రంగంలో రాయలసీమకే తలమానికమైన, ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన, ఘన చరిత్ర కలిగిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) కు ముంపు ముంచుకొచ్చింది. పాలకవర్గం వర్సిటీలోని ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే విధంగా నూతన మాస్టర్ రోడ్ల నిర్మాణానికి చాపకింద నీరులా యత్నాలు చేస్తోంది. ప్రశాంత వాతావరణానికి నిలయమైన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మాస్టర్ రోడ్ల నిర్మాణం వర్సిటీ పవిత్రతను దెబ్బ తీస్తుందని ఘోషించడమేకాకుండా ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు డిమాండు చేస్తున్నప్పటికీ, పాలకవర్గం మాత్రం గుట్టుచప్పుడు కాకుండా ముమ్మరంగా నిర్మాణ ప్రయత్నాలలో నిమగ్నమైంది. ఎంతో మంది ప్రముఖులను, పండితులను, శాస్త్రవేత్తలను, రాజకీయ నాయకులను దేశానికి అందించి, ప్రఖ్యాత పుణ్య క్షేత్రంలో విద్యా కేంద్రంగా విరాజిల్లుతూ ఆసియాలోనే బృహత్తర నిర్మాణాలు కలిగిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రహదారుల నిర్మాణం వల్ల భారీ వాహనాల రాకపోకలు, ధ్వనులు, వాయు కాలుష్యం కారణంగా ప్రశాంత వాతావరణానికి భంగం కలగడం, విద్యార్థులకు రక్షణ లేకపోవడం, పురాతనమైన, బృహత్తరమైన ఢమరుకం ఆకారంలో ఉన్నటువంటి శ్రీనివాస ఆడిటోరియం లాంటి నిర్మాణాలు తమ ప్రాభవాన్ని, స్వరూపాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని అనేక మంది విద్యావేత్తలు, మేధావులు ఘోషిస్తున్నారు. అంతేకాకుండా, విద్యా ప్రాంగణం కాస్తా విహార, వ్యాపార కేంద్రాలుగా మారిపోయే ప్రమాదం కూడా లేకపోలేదని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. తాజాగా జూ పార్క్ వద్ద నిర్మించదలచిన సెవెన్ స్టార్ హోటల్‌కు విశ్వవిద్యాలయం అడ్డంగా ఉందని, కార్పొరేషన్ కమిషనర్ బంగ్లాకు, వీఐపీలు స్టార్ హోటళ్లకు, తిరుమలకు వెళ్లేందుకు రహదారులు అవసరమని విశ్వవిద్యాలయం మధ్యలో కొత్త రోడ్ల నిర్మాణం చేయడం సబబు కాదని ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు పోరాటాలు చేస్తున్నాయి. అయితే పాలపక్షం ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్యానికి తిలోదకాలు పలికి... నిరంకుశత్వానికి బాటలు వేసినట్లేనని విశ్వవిద్యాలయంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పాలకవర్గం ఏం చేస్తుందో వేచిచూడాల్సి ఉంది.

మాస్టర్ రోడ్ల నిర్మాణంతో అపురూప కట్టడాలు దెబ్బతినే ప్రమాదం

విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తిరుపతి కార్పొరేషన్ వారు నిర్మించే రహదారుల వలన 50 సంవత్సరాల క్రితం నాటి ప్రధాన కట్టడాలు, ముఖ్యంగా ప్రపంచంలోనే ప్రత్యేకమైన మహాశివుని డమరుకం ఆకారంతో నిర్మించిన శ్రీనివాస ఆడిటోరియంకు ముప్పు ఏర్పడనున్నది. ఈ ఆడిటోరియం నిర్మాణంలో ప్రస్తుతం రెండు పక్కల ఉన్న 30 అడుగుల రోడ్డు వరకు పిల్లర్స్‌ను తిరగేసిన ఆంగ్ల అక్షరం 'వి' ఆకారంలో వేసి ఉన్నాయి. ఈ పిల్లర్స్ పైనే 80, 100 అడుగులు రోడ్లు వేయడం వలన ఆ దమరుకం ఆకారంలో ఉన్న ఆడిటోరియం దెబ్బతినే అవకాశం ఉంది. అదేవిధంగా పెద్ద పెద్ద వాహనాలు అలిపిరి వైపు ప్రయాణం చేస్తే కొండపైకి ఎక్కే ప్రయత్నంలో విపరీతమైన శబ్దం, కదలికల వల్ల పాత తరహాలో 60 సంవత్సరాల క్రితం పునాదులపై నిర్మించిన విశ్వవిద్యాలయం ప్రధాన భవనం, ఫిజికల్ సైన్స్ బ్లాక్, నాచురల్ సైన్స్ బ్లాక్, వామనరావు భవన్, ఓఆర్ఐ తదితర భవనాలు దెబ్బతినే అవకాశం ఉంది. విశ్వవిద్యాలయంలో రోడ్ల నిర్మాణం ఫలితంగా ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థ ఉనికికే ప్రమాదం వాటిల్లే అవకాశం కూడా లేకపోలేదని ఇంజనీర్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

పర్యావరణ సమతుల్యం దెబ్బతినే అవకాశం

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జాతీయ పక్షి నెమలి, అడవి కోళ్లు తదితర పక్షులు, జింకలు, కుందేళ్లు, దుప్పులు వంటి వన్య ప్రాణులు సంచరిస్తూ ఉంటాయి. అనేక రకాల వృక్ష సంపద ఉంది. ఈ రహదారుల నిర్మాణం వల్ల వచ్చే కాలుష్యం, రణఘోష ధ్వనులతో విశ్వవిద్యాలయ వాతావరణం కలుషితమై ఆ వన్య సంపదకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని మేధావులు చెబుతున్నారు. తిరుపతి ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచడంలో కూడా విశ్వవిద్యాలయం కీలకమైనది. ఉదయం, సాయంత్రం ఎంతో మంది నగర వాసులు ఆహ్లాదకర వాతావరణంలో నడక కోసం వస్తూ ఉంటారు. వీరితో పాటు స్థానికంగా ఉంటున్న దాదాపు 10 వేల మంది విద్యార్థినీవిద్యార్థుల ఆహ్లాదకర, విద్యను అభ్యసించే వాతావరణం కూడా ఈ రోడ్ల నిర్మాణం దెబ్బతీసే ప్రమాదం పొంచి ఉంది.

విశ్వవిద్యాలయాన్ని షాపింగ్ మాల్‌లా మార్చే ప్రయత్నం

విశ్వవిద్యాలయంలో ఈ రహదారుల నిర్మాణం ప్రధానంగా అలిపిరి రోడ్డు మార్గంలో నిర్మించనున్న సెవన్ స్టార్ హోటల్‌కు అనుకూలమైన రహదారిని ఏర్పాటు చేసే ప్రయత్నమేనన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అదేవిధంగా విశ్వవిద్యాలయంలో ప్రయాణించే రోడ్డుకు ఆ చివర... ఈ చివర... ప్రాంతాలలో పెట్రోల్ బంకులు పెట్టేందుకు కొంతమంది ఇప్పటికే ప్రణాళికలను ముమ్మరం చేశారు. అంతేకాకుండా రోడ్లకు రెండు వైపులా కొన్ని రకాల షాపులు, ట్రావెల్ ఏజెన్సీలు, పార్కింగ్ స్థలాలు పెట్టేందుకు మరి కొంతమంది రాజకీయ నాయకులు, వారి అనుచరులు ప్రయత్నాలు చేయడం మొదలుపెట్టారు.

బెంగళూరులో నలుగురి ఆత్మహత్యల మిస్టరీ?

- మచిలీపట్నం చేరిన మృతదేహాలు
- బందరుకోటలో తీవ్ర విషాద ఛాయలు

విశాలాంధ్ర-మచిలీపట్నం: బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబం ఆత్మహత్య ఘటన మిస్టరీగా మారింది. ఇది మచిలీపట్నంలో కలకలం రేపింది. కృష్ణా జిల్లా బందరు కోటకు చెందిన గుండు వీరాంజనేయులు అలియాస్ గోపి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా బెంగళూరులో విధులు నిర్వహిస్తున్నాడు. హేమావతి అని యువతితో మూడున్నర సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో వివాహం అయింది. బెంగళూరులోని తాడిగుడి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగన్నహళ్లి అనే అపార్ట్‌మెంట్‌లో వీరాంజనేయులు, హేమావతి ఇద్దరు కుమార్తెలతో గత 3 నెలలుగా నివాసం ఉంటున్నారు. మంగళవారం వీరాంజనేయులు, తన భార్య, ఇద్దరు పిల్లలు తమ ఇంటిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. రెండు రోజులుగా తమ కుమార్తెకు ఫోన్ చేసినా స్పందన రాకపోవటంతో అనుమానం వచ్చిన హైమావతి తల్లిదండ్రులు బెంగుళూరు వెళ్లి చూడగా నలుగురూ విగత జీవులై కనిపించారు. భార్యాభర్తల మధ్య ఉన్న మనస్పర్థల కారణంగా పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుని ఉంటారని భావిస్తున్నారు. అయితే దీనిపై అనేక కథనాలు వినవస్తున్నాయి. ఇది హత్య? ఆత్మహత్య?, అందుకు సంబంధించిన కారణాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత వీరి మరణాలకు గల కారణాలు బయట పడతాయని పోలీసులు తెలిపారు. ఈ నలుగురు మృతదేహాలను బెంగళూరు నుంచి ప్రత్యేక వాహనంలో మచిలీపట్నం తీసుకువచ్చారు. మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. వీరి మృతితో బందరుకోటలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

అమరరాజా బస్సుపై దాడి దుర్మార్గం: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: చిత్తూరు జిల్లాలో అమరరాజా బస్సుపైనా, ఉద్యోగులపైనా వైసీపీ శ్రేణులు దాడి చేయటాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వైసీపీ ఆగడాలు మితిమీరిపోతున్నాయని ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో అమరరాజా కంపెనీ బస్సుపై, ఉద్యోగులపై వైసీపీ శ్రేణులు దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. వైసీపీ అరాచక శక్తులు విధ్వంసం సృష్టిస్తుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారా అని ప్రశ్నించారు. జగన్ సర్కార్ వేధింపులతో ఇప్పటికే అమరరాజా కంపెనీ తెలంగాణకు తరలిపోయిందని పేర్కొన్నారు. వైసీపీ వికృత చేష్టలతో పారిశ్రామికవేత్తలు బెదిరిపోతున్నారని తెలిపారు.. ప్రజాతంత్ర వాదులంతా వైసీపీ అరాచకాలను ఖండించాలని కోరారు.

ఎల్గార్ పరిషత్ కేసులో గోంజాల్వెజ్, ఫెరీరియాకు ఊరట

ముంబై: ఎల్గార్ పరిషత్ కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు హక్కుల కార్యకర్తలు వెర్నమ్ గోంజాల్వెజ్, అరుణ్ ఫెరీరియాకు భారీ ఊరట లభించింది. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన వారంలోగా వీరి విడుదలకు ఉత్తర్వులను ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జారీ చేసింది. దీంతో శనివారం మధ్యాహ్నం నవీ ముంబైలోని తలోజా జైలు నుంచి ఇద్దరు విడుదలయ్యారు. కార్యకర్తలకు స్వాగతం పలికేందుకు కొందు మద్దతుదారులు జైలు వద్దకు వచ్చినట్లు పోలీసు అధికారి చెప్పారు. ఈ కేసులో అరెస్టు అయిన 16 మందిలో ఐదుగురు విడుదలయ్యారు.

న్యాయస్థానాల్లో రిజర్వేషన్లు తప్పనిసరి

- అప్పుడే సామాజిక న్యాయం ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్
- ఎస్సీ, ఎస్టీలు జడ్జీలుగా ఉండాలి మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): దేశంలో అన్ని వ్యవస్థలు, రంగాలలోనూ రిజర్వేషన్లు అమలు జరిగితేనే సామాజిక న్యాయం సాధ్యమని మాజీమంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) అధ్వర్యంలో ఏఐడీఆర్‌ఎం జాతీయ సమితి సమావేశాల సందర్భంగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళల రిజర్వేషన్లు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ అధ్యక్షతన శనివారం సెమినార్ జరిగింది. మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఏ దళిత సంఘం గుర్తించని ఈ అంశాన్ని డీహెచ్‌పీఎస్ తెరపైకి తీసుకురావడం ముదావహమన్నారు. సంఘ బాధ్యులకు, ప్రత్యేకించి మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌కు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ అంబేద్కర్ ఆకాంక్షించిన అంశాల్లో ఇదొకటని పేర్కొన్నారు. సుప్రీం కోర్టులో అర్థవంతమైన పరిష్కారాలు దొరకడం లేదని, మణిపూర్ ఘటనలే ఇందుకు ఉదాహరణలన్నారు. దేశంలో, రాష్ట్రంలో కులం, ప్రాంతీయత ప్రాతిపదికన అవకాశాలు కల్పించడం వలన ఎస్సీలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుతో కాకుండా కులంతో చూసే పరిస్థితి ఉందన్నారు. 1980లో న్యాయవ్యవస్థలో 80శాతం బ్రాహ్మణులున్నారని, ఈ మధ్యకాలంలో చర్చలు జరుగుతున్న కారణంగా 60 శాతానికి తగ్గిందన్నారు. సీఎం జగన్ కేబినెట్‌లో ఎస్సీలు ఐదుగురు, బీసీలు 15 మంది ఉన్నారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు, మైనార్టీలకు అన్ని వ్యవస్థలలో రిజర్వేషన్లు అమలైతేనే అది ప్రజాస్వామ్యమవుతుందన్నారు. మాజీ జడ్జి పి.గురప్ప మాట్లాడుతూ హైకోర్టు, సుప్రీంకోర్టులకు జడ్జీలుగా ఎస్టీ, ఎస్సీ, మహిళలను తీసుకోవటం కోసం పోరాటం చేసినా ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. న్యాయస్థానంలో ఉన్న జడ్జీలు బంధుత్వం ఉంటేనే కేటాయింపులు ఉంటాయని, 600 మంది జడ్జిలలో ఎస్సీలు 18 మంది, ఎస్టీలు 9 మంది ఉన్నారన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే శాస్త్రీయ దృక్పథంతో అవగాహన కల్పించాలని అభిప్రాయపడ్డారు. ఏఐడీఆర్‌ఎం జాతీయ అధ్యక్షులు ఎ.రామమూర్తి మాట్లాడుతూ న్యాయస్థానాల్లో న్యాయమూర్తులకు రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్‌తో సెమినార్ జరపడం సంతోషంగా ఉందన్నారు. ఏఐడీఆర్ ఎం జాతీయ కార్యదర్శి వీఎస్ నిర్మల్ మాట్లాడుతూ 1931 బ్రిటిష్ కాలంలో హిందూ వ్యవస్థలో ఎస్సీలను అసలు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో రాబోయే కాలంలో నిరుద్యోగ సమస్య మరింత పెరగబోతుందన్నారు. దిల్లీలో అగ్రవర్ణాలు ఎస్సీ దొంగ సర్టిఫికెట్లతో చలామణి అవుతున్నారని తెలిపారు. సంఘ బాధ్యులు రాబోయే కాలంలో గవర్నర్, రాష్ట్రపతులకు వినతిపత్రాలు అందజేసి, ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలుగా గవర్నర్ ఆమోదించిన వారిని నియమించవచ్చన్నారు.

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ జడ్జీల నియామకాలపై సామాజిక పొందిక ఉండాలని, విజయవాడ కేంద్రంగా డీహెచ్‌పీఎస్ చేపట్టిన కార్యక్రమానికి అభినందనలు తెలిపారు. దేశంలో దళితులకు ఎలా అన్యాయం జరుగుతుందో సోదాహరణగా వివరించారు. 1966 కంచికచర్ల హరిజన యువకుడిని అగ్రవర్ణాలు కట్టివేసి హత్య చేశాయని, నాడు కమ్యూనిస్టులు అండగా కోర్టుకు వెళ్లారని, ఆ కోర్టులోనూ అగ్రవర్ణ జడ్జిలు ఉండటంతో న్యాయం జరగలేదని గుర్తుచేశారు. బాబ్రీ మసీదు, రామజన్మభూమి వివాదంపై న్యాయమూర్తులు బీజేపీకి అనుకూలంగా వ్యవహరించడం వల్ల మైనార్టీల మసీదు స్థలం కేటాయించారన్నారు. ఆ జడ్జికి రిటైరైన మూడో రోజున రాజ్యసభ సీటు కేటాయించారని తెలిపారు. కిందస్థాయి వర్గాల వారు జడ్జీలుగా ఉంటే ఇలాంటి దుర్మార్గ తీర్పులు ఉండవన్నారు. డీహెచ్‌పీఎస్ న్యాయస్థానాలలో రిజర్వేషన్ల అమలు కోసం వచ్చిన ఆలోచనని, కేరళకు చెందిన ఒక ఎంపీ, వైసీపీ ఎంపీ వంగా గీత పార్లమెంట్‌లో చర్చించారని తెలిపారు. బీఆర్ అంబేద్కర్ చెప్పిన సామాజిక న్యాయం కోసం సరైన ఆలోచనతో న్యాయవ్యవస్థ ఉండాలని కోరారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో డీహెచ్‌పీఎస్ అన్ని జిల్లాలలో సదస్సులు నిర్వహించి, సామాజిక న్యాయం కోసం పోరాటాలు నిర్వహించాలని, అన్ని సంస్థలు ఈ అజెండాను అమలు కోసం కృషి చేయాలన్నారు. సామాజిక హక్కుల నాయకులు దోనేపూడి శంకర్ మాట్లాడారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్ బృందం అభ్యుదయ, విప్లవ గేయాలు ఆలపించింది. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, న్యాయవాది నంద, ఏసురత్నం, కొరివి వినయ్ కుమార్, కేవీపీఎస్ నాయకులు జి.నటరాజ్, ఏఐటీయూసీ నాయకులు వెంకటసుబ్బయ్య, ప్రజానాట్యమండలి నాయకులు చిన్నం పెంచలయ్య, న్యాయవాది జీవీరాజు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ నాయకులు సంగుల పేరయ్య, సామాజిక నాయకులు, సంఘాల కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పేద పిల్లలకు వైద్య విద్య చేరువ

- రూ.8,500 కోట్లతో 17 వైద్య కళాశాలలు
- విజయనగరం వైద్య కళాశాల పనులు పరిశీలించిన మంత్రి విడదల రజిని

విశాలాంధ్ర-విజయనగరం: ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో వైద్య రంగంలో భారీ సంస్కరణలు తీసుకొచ్చామని, దాని ఫలితంగానే పేద పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య విద్య సులభంగా చేరువవుతోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో రూ.8,500 కోట్లతో 17 వైద్య కళాశాలలు ఏర్పాటవుతున్నాయని, వాటిలో నిర్మాణ పనులను పూర్తి చేసుకున్న ఐదు కళాశాలలు ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. వాటిలో సెప్టెంబరు నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని అన్నారు. ఉత్తరాంధ్రకే తలమానికంగా రూ.500 కోట్లతో 70 ఎకరాల్లో నిర్మితమవుతున్న విజయనగరం వైద్య కళాశాల నిలవనుందని మంత్రి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ శ్రీధర్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి మంత్రి రజిని శనివారం వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. స్కిల్ ల్యాబ్, ప్రధాన కళాశాల భవనం, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, సమావేశ మందిరాలను పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యులు, విలేకరులను ఉద్దేశించి మాట్లాడారు. గత నాలుగేళ్లలో వైద్య రంగంలో తీసుకున్న చర్యలను వివరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.